www.trinetnews.com

# ట్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 83 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు మంగళవారం అక్టోబర్ 27, 2026 పేజీలు:12 వెల.10/-

**బంగారంపై నడవొచ్చు.. దుబాయ్‌లో త్వరలో గోల్డ్ ఫుట్‌పాత్..!**



2లో





# తుమ్మిడిహెట్టిపై సానుకూల స్పందన!

- తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలిస్తాం: ఫడ్నవీస్.
- బ్యారేజీ ఎత్తు పెంపుపై రేవంత్ బృందంతో చర్చలు.
- నీటి లభ్యత, ముంపు ప్రభావంపై అధ్యయనం.
- ఇరు రాష్ట్రాల అధికారులతో కమిటీ ఏర్పాటు ప్రతిపాదన.
- సాంకేతిక, పర్యావరణ అంశాల పరిశీలన తర్వాతే తుది నిర్ణయం.

**ముంబై:**
తుమ్మిడిహెట్టి ప్రాజెక్ట్ ఎత్తు పెంపునకు సహకరించాలన్న తెలంగాణ అభ్యర్థనపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున: పరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి ప్రాబ్లమ్ లేదని చేశారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తెలంగాణకు అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి నీటిపారుదల ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్?తో సోమవారం (అక్టోబర్ 26) సమావేశమయ్యారు. ముంబైలోని సహ్యాద్రి ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ, మహారాష్ట్రల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై ఈ సమావేశంలో కీలకమైన చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు 152 మీటర్లకు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ మాట్లాడుతూ.. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

2లో..



## 30 సెకన్లలో నిరసనలు ఆగుతాయి: రాహుల్

- నవంబరు 1న 'ఓటు చోరీ'పై ఇండియా కూటమి నిరసన.
- నిరసన వాయిదా వేయాలని వ్యాపారుల విజ్ఞప్తి.
- రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం అంచనా.
- సీఈసీని తొలగించాలని మోదీని కోరండి: రాహుల్

2లో



## రూ.100 కోట్ల అవినీతి కేసు.. డీఎంకే మాజీ మంత్రి అరెస్టు

డీఎంకే నేత, తమిళనాడు మాజీ మంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యామొళి అరెస్టయ్యారు. ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి రూ.100 కోట్ల అవినీతి కేసులో ఆయన్ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రైవేటు బడులకు గుర్తింపు, చట్టబద్ధమైన అనుమతుల జారీ విషయంలో అవకతవకలపై మద్రాస్ హైకోర్టు సోమవారం ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

## రక్షణ రంగానికి భారీ ఊతం!



- రూ.2.12 లక్షల కోట్ల రక్షణ కొనుగోళ్లకు ఆమోదం.
- త్రివిధ దళాల సామర్థ్యాల పెంపునకు కీలక నిర్ణయం.
- తేలికపాటి మల్టీరోల్ హెలికాప్టర్ల కొనుగోలుకు గ్రీన్‌సిగ్నల్.
- దీర్ఘశ్రేణి ఆత్మాహుతి డ్రోన్లకు ఆమోదం.
- గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్ల కొనుగోలు.
- నౌకాదళానికి ఏఓడీఎస్ రక్షణ వ్యవస్థ.
- 82 శాతం కొనుగోళ్లు దేశీయంగానే!

భారత త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.2.12 లక్షల కోట్ల వ్యయంతో సైనిక సామగ్రి కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన 'రక్షణ కొనుగోళ్ల మండలి' .. సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. తేలికపాటి మల్టీరోల్ హెలికాప్టర్లు, దీర్ఘశ్రేణి ఆత్మాహుతి డ్రోన్లు, రాడార్ల వంటివి ఇందులో ఉన్నాయి. ఈ కొనుగోళ్లలో 82 శాతం దేశీయంగానే చేయనున్నారు.భారత సైన్యం కోసం తేలికపాటి మల్టీరోల్ హెలికాప్టర్లు, అతి స్వల్పశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ, దీర్ఘశ్రేణి ఆత్మాహుతి డ్రోన్ల వంటి ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు డీఏసీ ఆమోదముద్ర వేసింది. నౌకాదళం కోసం 'యాక్టివ్ ఆఫ్‌బోర్డ్ డెకాయ్ సిస్టమ్', ఇతర వ్యవస్థల కొనుగోలుకు ఆమోదం లభించింది. శత్రువుల నౌకా విధ్వంసక క్షిపణుల నుంచి రక్షణ కల్పించడంలో ఏఓడీఎస్ సాయపడుతుందని రక్షణశాఖ తెలిపింది.



2లో..

## ఎల్‌నినోపై కాంగ్రెస్ నిర్లక్ష్యం!

- » ఎల్‌నినో ముప్పు తెలిసినా ముందస్తు చర్యలు శూన్యం.
- » నీళ్లు ఉన్నా లిఫ్ట్ చేయలేని ప్రభుత్వం.
- » గోదావరి, కృష్ణా జలాలను ఎందుకు వినియోగించలేదు?
- » ప్రాజెక్టుల నీటి నిల్వలపై శ్వేతపత్రం విడుదల చేయాలి.
- » సీఎం వ్యాఖ్యలతో రైతుల్లో భయాందోళనలు.
- » తెలంగాణలోనే క్రాప్ హాలిడే ఎందుకు?
- » రాష్ట్రానికి కరువు తెచ్చిందే కాంగ్రెస్: హరీష్‌రావు

**హైదరాబాద్:**
ఎల్‌నినో పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తన చేతకానితనాన్ని ప్రకృతిపై నెట్టే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు మండిపడ్డారు.

'సర్' నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే..

## సుప్రీంకోర్టులో ఈసీ అఫిడవిట్





ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టాలన్న తన నిర్ణయాన్ని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో సమర్థించుకుంది. 'సర్' ప్రక్రియను చట్టప్రకారమే చేపట్టామని.. దీనికి సంబంధించి జారీ చేసిన మూడు ఉత్తర్వులను సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని పేర్కొంది. ఓటర్ల నమోదుకు ఉపయోగించే 'ఫారం 6'లో మార్పులు చేశారని, ఇతర నిర్ణయాలను కూడా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండానే తీసుకున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఆదేశం మేరకు ఈసీ సోమవారం అఫిడవిట్ దాఖలు చేసింది.

## గోదావరి జలాలపై దుష్ప్రచారం ఎందుకు?

- కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయేందుకు నీటిమట్టం సరిపోవడం లేదు.
- 93.5 మీటర్లు ఉంటేనే నీటి ఎత్తిపోత సాధ్యం.
- ప్రస్తుతం నీటిమట్టం 89 మీటర్లే: ఎంపీ చామల.
- కృష్ణా జలాల వాటాను 299 టీఎంసీలకు పరిమితం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపణ.
- దేవాదుల, సీతారామ ప్రాజెక్టులతో గోదావరి జలాల వినియోగం.
- ఎల్‌నినోపై ఈ నెల 28న అఖిలపక్ష సమావేశం.



**హైదరాబాద్:**
తెలంగాణకు గోదావరి జలాల వినియోగంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది.

## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు కేంద్రం గ్రీన్ సిగ్నల్... కొత్త లైన్లు ఎక్కడెక్కడ అంటే..!

హైదరాబాద్ వాసులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది కేంద్రం. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం. రెండో ఫేజ్ లో భాగంగా 76 కిలోమీటర్ల మెట్రో లైన్ కు రూ.24 వేల 269 కోట్ల నిధులు విడుదల చేసింది కేంద్రం.ఈ ప్రాజెక్టులో మొత్తం 5 కారిడార్లు, 76 కిలోమీటర్ల పొడవున మెట్రో నెట్‌వర్క్ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.



2లో





2లో

## విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసు.. నేపాలీ ముఠా అరెస్ట్





**హైదరాబాద్:**
జూబ్లీహిల్స్‌లో జరిగిన విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజ హత్య కేసులో నేపాలీ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా పోలీసులు నేపాల్ వెళ్లారు. అక్కడ ప్రధాన నిందితురాలు కల్పన సహా నలుగురిని అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. విచారణ తర్వాత వైద్య పరీక్షల నిమిత్తం వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మే7న విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్యను నేపాలీ ముఠా హత్య చేసింది. హత్య అనంతరం ఇంట్లోని బంగారు నగలను తీసుకుని నిందితులు పరారయ్యారు.

తెలంగాణ మద్యం ప్రియులకు చేదు వార్త..

## మారనున్న బీరు టేస్ట్.. కారణం ఏంటంటే..



ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో మంజీరా నీళ్లకు కొరత ఏర్పడటంతో ఈ ప్రభావం బీరు కంపెనీలపై పడింది. మంజీరా నీటి సరఫరాలో కోత విధించే పరిస్థితులు ఉండటంతో.. సంగారెడ్డి, పరిసర ప్రాంతాల్లోని బ్రూవరీలు భూగర్భ జల వనరుల కోసం అన్వేషిస్తున్నాయి. భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో, ఫార్మాస్యూటికల్, ఇతర పరిశ్రమలు కూడా ప్రత్యామ్నాయాల కోసం చూస్తున్నాయి. సంగారెడ్డి పట్టణ పరిసరాల్లోని బీర్ కంపెనీలకు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి అధికారులు మంజీరా నీటి సరఫరాను దాదాపుగా నిలిపివేశారు.ఆ కంపెనీలు బీర్ల తయారీకి భూగర్భ జలాలపై ఆధారపడక తప్పని పరిస్థితి ఉంది. ఈ కారణంగా తెలంగాణలో ఇకపై విక్రయించే బీర్ల రుచి మారనుంది. మంజీరా నీరు బీరుకు రుచిని ఇస్తుంది.

మిగతాది 2 లో

## చనిపోతేనే బిల్లులు ఇస్తారా?

- జడ్చర్ల అభివృద్ధికి రూ.30 వేల మందితో ఆమరణ నిరాహార దీక్ష.
- నేను చనిపోతేనే బిల్లులు ఇస్తారా? --- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి.
- నాగర్‌కర్నూల్‌లో కాంట్రాక్టర్ మరణిస్తే రూ.5 కోట్ల బిల్లు ఇచ్చారని వ్యాఖ్య.
- మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులా? అంటూ ప్రశ్న.
- జడ్చర్లకు కాలువలు, సాగునీరు సాధించడమే లక్ష్యం.
- రైతుల ప్రయోజనాల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని వెల్లడి.

# ‘ఎల్‌నినో ప్రమాదాన్ని కాంగ్రెస్ పట్టించుకోలేదు’

మొదటిపేజీ తరువాయి
గత ఆరు నుంచి తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ముప్పు ఉందని తెలుస్తున్నప్పటికీ, ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.
గోదావరి, కృష్ణా జలాల నుంచి నీటిని ఎందుకు లిఫ్ట్ చేయలేదని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, తాగు - సాగు నీటి లభ్యతపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో వల్ల పంటలు వేసుకోవద్దని సీఎం చెప్పడం రైతుల్లో భయాందోళనలు సృష్టిస్తోందని విమర్శించారు.

‘ఎల్‌నినో ప్రమాదాన్ని కాంగ్రెస్ పట్టించుకోలేదు. నీళ్లు ఉన్నా తీసుకునే తెలివి ప్రభుత్వానికి లేదు. ఎక్కడా లేని క్రాప్ హాలీడే తెలంగాణలోనే ఎందుకు?, రాష్ట్రానికి కరువు తెచ్చిందే కాంగ్రెస్ ’ అని మండిపడ్డారు.

## చనిపోతేనే బిల్లులు ఇస్తారా? చావడానికైనా సిద్ధం: ఎమ్మెల్యే అనిరుధ్

మొదటిపేజీ తరువాయి
జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. జడ్చర్ల అభివృద్ధి కోసం 30 వేల మందితో ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని అన్నారు. మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులు ఇస్తే.. మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటని ఆయన నిలదీశారు.
నిరుధ్ రెడ్డి సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. “నాగర్‌కర్నూల్‌లో కాంట్రాక్టర్ మరణిస్తే రూ.5 కోట్ల బిల్లు ఇచ్చారు.. జడ్చర్లలో నేను చనిపోతేనే బిల్లులు ఇస్తారా? అలాగైతే నేను నియోజకవర్గ అభివృద్ధి కోసం చావడానికి సిద్ధం. అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి చెందితేనే ప్రభుత్వం మనుగడ సాధిస్తుంది. పార్టీలకు అతీతంగా ఒక్కటై పోరాడుదాం. జడ్చర్లకు కాలువలు, సాగునీరు సాధించుకుందాం. జడ్చర్ల రైతుల ప్రయోజనాల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం” అని ఆయన వ్యాఖ్యానించారు.

# గోదావరి జలాలపై దుష్ప్రచారం ఎందుకు?

మొదటిపేజీ తరువాయి
కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన నీటిమట్టమే లేదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 93.5 మీటర్ల నీటిమట్టం ఉంటేనే నీటిని ఎత్తిపోయడం సాధ్యమవుతుందని.. ప్రస్తుతం 89 మీటర్ల ప్రవాహమే ఉందని వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల దగ్గరా ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. మరోవైపు, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను 299 టీఎంసీలకు పరిమితం చేసే ఒప్పందానికి నాడు బీఆర్ఎస్ ప్రభుత్వమే అంగీకరించిందని ఆరోపించారు.

పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రానికి నష్టం చేసిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు గోదావరి జలాలపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ గోదావరి జలాలను వినియోగించుకుంటున్నామని స్పష్టం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. అదేవిధంగా ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఎంపీ తెలిపారు. ఈ నెల 28న భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిర్వహించనున్న అఖిలపక్ష సమావేశానికి అన్ని పార్టీలు హాజరై నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని కోరారు.

# రూ.100 కోట్ల అవినీతి కేసు.. డీఎంకే మాజీ మంత్రి అరెస్టు

మొదటిపేజీ తరువాయి
ఆ తర్వాత కొద్దిసేపటికే పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు.
తిరువెంబూరు నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు (2016, 2021) ఎమ్మెల్యేగా విజయం సాధించిన మహేశ్.. 2021-26 మధ్యకాలంలో తమిళనాడు పాఠశాల విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో శాశ్వత గుర్తింపు, ఇతర అనుమతుల కోసం ‘పార్టీ ఫండ్’ ముసుగులో 1,000 ప్రైవేట్ పాఠశాలల మేనేజ్‌మెంట్‌ల నుంచి డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసింది.

## మోదీతో ఆ మాట చెప్పండి.. 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయి: రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి
‘ఓటు చోరీ’కి వ్యతిరేకంగా దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబరు 1న ‘ఇండియా’ కూటమి ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసనను వాయిదా వేయాలని స్థానిక వ్యాపార వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. దీపావళి పండగ నేపథ్యంలో తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశాయి. ఈ వ్యవహారంపై ఆయన ‘ఎక్స్’ వేదికగా స్పందించారు.

“దిల్లీలోని ప్రతి వ్యాపారి మాటను వింటున్నాం. వారి సమస్యలను అర్థం చేసుకుంటున్నాం. అయితే.. మెట్రోలను ప్రభుత్వమే నిలిపివేసింది. రోడ్లనూ మూసివేసింది. దేశ రాజధానిని లాక్‌డౌన్‌లో ఉంచింది. ఓట్లనే చోరీ చేస్తే.. ఇక మీ దుకాణాలు, సేవింగ్స్, పిల్లల భవిష్యత్తు.. ఏదీ సురక్షితం కాదు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పండి. అప్పుడు 30 సెకన్లలోనే ఈ నిరసనలన్నీ ఆగిపోతాయి” అని వ్యాపారులను ఉద్దేశించి రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

దీపావళి పండగ సీజన్‌లో దిల్లీలో పెద్దఎత్తున వ్యాపార కార్యకలాపాలు జరుగుతాయని ‘ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ’ పేర్కొంది. అయితే, నవంబరు 1న చేపట్టే నిరసన కారణంగా రామ్‌లీలా మైదానం పరిసరాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడొచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో నవంబరు 10 తర్వాత నిరసనను నిర్వహించాలని కోరుతూ రాహుల్ గాంధీకి లేఖ రాసింది.

## ‘సర్’ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే.. సుప్రీంకోర్టులో ఈసీ అఫిడవిట్

మొదటిపేజీ తరువాయి
సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఈ అఫిడవిట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వెల్లడించింది.చట్టంలో గానీ, ఓటర్ల నమోదుకు ఉపయోగించే ‘ఫారం 6’లో గానీ ఎటువంటి సవరణలు చేయలేదని ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. వార్తా పత్రికల్లో వచ్చే కథనాలను చట్టపరంగా సాక్ష్యంగా పరిగణించరని.. అందువల్ల, సీఈసీని ఆయన విధులు నిర్వహించకుండా అడ్డుకోలేరని పేర్కొంది. ‘సర్’ ఉత్తర్వుల ద్వారా ‘ఫారం 6’ను సవరించారన్న వాదనను ఖండిస్తూ.. ఈ ప్రక్రియ కోసం ఉపయోగించిన డిక్లరేషన్ అనేది ఒక ప్రత్యేక పత్రమని, అది ‘ఫారం 6’లో భాగం కాదని

# తుమ్మిడిహెట్టిపై సానుకూల స్పందన!

మొదటిపేజీ తరువాయి
సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. మ్యాప్‌లుచూడండి

స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు.

ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు.

ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు.

దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

# రాజీనామా చేసి, వేరే పార్టీలో చేరడం రాజకీయ ప్రక్రియలో భాగమే: సుప్రీం కోర్టు



తమిళనాడులో ఎన్నికల అనంతరం అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, అధికార టీవీకే లో చేరిన కేసులో సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. వేరే పార్టీకి వెళ్లాలనుకున్న వారు రాజీనామా చేసే వెళ్తారని.. అది రాజకీయ ప్రక్రియలో భాగమని స్పష్టం చేసింది. రాజీనామా, అనర్హత వేటు అనేవి వేర్వేరు రాజ్యాంగ ప్రక్రియలు అని.. వాటిపై పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ రాజీనామాలను ఆమోదించే అధికారం స్పీకర్‌కు ఉంటుందని తెలిపింది. అనర్హత పిటిషన్ విచారణను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఆరుగురు ఎమ్మెల్యేల రాజీనామాలు, పార్టీ మార్పుపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది.

పార్టీ మారిన ఆరుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను ఐదేళ్లపాటు అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ పార్టీ నేతలు ఇటీవల మద్రాస్ హైకోర్టు లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో, ఎన్నికల సంఘం, తమిళనాడు ప్రధాన ఎన్నికల అధికారికి ఒక ఆదేశం జారీ చేయాలని కోరారు. దీని ప్రకారం, స్వచ్ఛందంగా రాజీనామా చేసిన ఎమ్మెల్యే, ఆ రాజీనామా వల్ల ఏర్పడే ఉప ఎన్నికలో తిరిగి పోటీ చేయాలనుకుంటే.. దాని నిర్వహణకు అయ్యే ప్రభుత్వ వ్యయంతో సమానమైన మొత్తాన్ని ముందుగా డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే ఆ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదించిన తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాన్ని సమర్థించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ..పిటిషనర్ సుప్రీంను ఆశ్రయించారు.

# బంగారంపై నడవొచ్చు.. దుబాయ్‌లో త్వరలో గోల్డ్ ఫుట్‌పాత్..!

మొదటిపేజీ తరువాయి


పసిడి వర్తకానికి కేంద్రంగా పేరొందిన దుబాయ్.. పర్యాటకులను ఆకట్టుకునేందుకు వినూత్న ప్రయత్నాలకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే ఇక్కడ ప్రారంభించిన ‘దుబాయ్ గోల్డ్ డిస్ట్రిక్ట్ ’ను చూసేందుకు సందర్శకులు వస్తున్నారు. వారిని మరింతగా ఆకర్షించేందుకు ఈ ప్రాంతంలో బంగారంతో నడకమార్గాన్ని నిర్మిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి ఈ ‘గోల్డ్ వాక్‌వే ’ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇలాంటి ఫుట్‌పాత్ నిర్మించడం ప్రపంచంలోనే ఇదే తొలిసారి కావడం విశేషం.
2026 చివరి నాటికి ఈ పసిడి నడక మార్గాన్ని ప్రారంభించనున్నట్లు దుబాయ్ గోల్డ్ డిస్ట్రిక్ కమర్షియల్ సెక్టార్ సీనియర్ డైరెక్టర్ రషీద్ అల్ హర్మోదీ వెల్లడించారు. “పసిడి వర్తకంలో దుబాయ్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చడం, ఈ నగరాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికల్లో భాగంగా ‘గోల్డ్ వాక్‌వే’ ప్రాజెక్ట్‌ను చేపట్టాం. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంతో నిర్మిస్తోన్న ఈ ఫుట్‌పాత్‌పై స్థానికులు, పర్యాటకులు నడుచుకుంటూ వెళ్తూ దుబాయ్ గోల్డ్ డిస్ట్రిక్ట్ అందాలను వీక్షించొచ్చు. దీంతో పాటు ఇక్కడ తయారయ్యే బంగారు ఆభరణాలతో ఓ భారీ ఎగ్జిబిషన్ కూడా నిర్వహించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నాం” అని వెల్లడించారు.
ఈ ఏడాది ఆరంభంలో దుబాయ్ గోల్డ్ డిస్ట్రిక్ట్‌ను ప్రారంభించారు. ఓ ప్రముఖ ఆభరణాల తయారీ సంస్థ దుబాయ్ వేదికగా ప్రపంచంలోనే అత్యంత బరువైన, అతి పెద్ద బంగారు కమ్మలను ప్రదర్శించింది. మయూర సహస్ర పేరుతో రూపొందించిన ఈ అద్భుతమైన కళాఖండానికి రెండు గిన్నిస్ రికార్డులు లభించాయి. భారతీయ సంప్రదాయ హస్తకళా నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన ఈ 22 క్యారెట్ల బంగారు కమ్మల బరువు ఏకంగా 16.514 కిలోలు కాగా, పొడవు 1.215 మీటర్లు, వ్యాసం 0.682 మీటర్లుగా ఉంది. 55 మంది స్వర్ణకారులు 5,840 గంటల పాటు శ్రమించి వీటిని రూపొందించారు.

## వాటర్ హీటర్ తగిలి వివాహిత మృతి...

స్నానం చేసేందుకు నీటిని వేడి చేస్తుండగా ప్రమాదవశాత్తు వాటర్ హీటర్ తగిలి ఓ వివాహిత మృతి చెందింది. ఈ విషాద ఘటన నగరంలోని బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న భరత్‌నగర్‌లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. రెండు నెలల పసిబాబును వదిలి ఆమె మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.
పోలీసుల వివరాల ప్రకారం.. భరత్‌నగర్‌లో అబ్దుల్ రవూఫ్ తన భార్య అయేషాబేగంతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. రవూఫ్ ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. ఈ దంపతులకు రెండు నెలల క్రితమే బాబు జన్మించాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అయేషాబేగం స్నానం చేసేందుకు నీటి బకెట్‌లో వాటర్ హీటర్‌ను పెట్టింది. అయితే, ప్రమాదవశాత్తు హీటర్ తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు కేంద్రం గ్రీన్ సిగ్నల్... కొత్త లైన్లు ఎక్కడెక్కడ అంటే..!

మొదటిపేజీ తరువాయి
ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.24,269 కోట్లు కాగా.. ఎయిర్‌పోర్ట్ కారిడార్‌తో పనులు ముందుగా మొదలు కానున్నాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 పనులను 2029 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది ప్రభుత్వం. మ్యాప్‌లుచూడండి

**కొత్త లైన్లు ఇవే:**
కారిడార్ 1: నాగోల్ -- శంషాబాద్ విమానాశ్రయం ( 36.8 కిలోమీటర్లు )
ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట వైపు నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు మెట్రో కనెక్టివిటీ కల్పించే కీలక మార్గం ఇది. ఐటీ ఉద్యోగులు, విమాన ప్రయాణికులకు ఉపయోగపడే అవకాశం ఉంది.

**కారిడార్ 2: రాయదుర్గం -- కోకాపేట నియోపోలిస్ ( 11.6 కిలోమీటర్లు )**

ఈ కారిడార్ ద్వారా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట పరిసరాల్లో నివసించే వారు, ఐటీ ఉద్యోగులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడే అవకాశం ఉంది.

**కారిడార్ 3: ఎంజీబీఎస్ -- చాంద్రాయణగుట్ట ( 7.5 కిలోమీటర్లు )**

ఓల్డ్ సిటీ ప్రాంతాలకు మెట్రో విస్తరణలో ఈ కారిడార్ కీలకం కానుంది.

**కారిడార్ 4: మియాపూర్ -- పటాన్‌చెరు ( 13.4 కిలోమీటర్లు )**

ఈ కారిడార్ ద్వారా పశ్చిమ హైదరాబాద్ శివారు ప్రాంతాలు, పారిశ్రామిక ప్రాంతాలకు ప్రయాణ సౌకర్యం పెరిగే అవకాశం ఉంది.

**కారిడార్ 5: ఎల్బీనగర్ -- హయత్‌నగర్ ( 7.1 కిలోమీటర్లు )**

ఈ కారిడార్ ద్వారా తూర్పు వైపు శివారు ప్రాంతాల నుంచి సిటీకి వచ్చే ప్రయాణికులకు మెట్రో సేవలు విస్తరిస్తాయి.

# తెలంగాణ మద్యం ప్రియులకు చేదు వార్త.. మారనున్న బీరు టేస్ట్.. కారణం ఏంటంటే..

మొదటిపేజీ తరువాయి
అందువల్ల.. తెలంగాణలోని ప్రధాన బ్రూవరీలు సంగారెడ్డి పట్టణంలో, పరిసర ప్రాంతాలలో తమ బీర్ల తయారీ యూనిట్లను ఏర్పాటు చేశాయి. బీర్ల తయారీకి ఏడాది పొడవునా సింగూర్ ప్రాజెక్ట్ నుంచి నీళ్లను వాడుకునేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మ్యాప్‌లుచూడండి

ఇక బీరు కంపెనీలకే కాదు ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలతో పాటు, హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు తాగునీరందించే సింగూరు ప్రాజెక్ట్?లో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరువలో ఉండటంతో తాగు నీటి కష్టాలు తప్పేలా లేవు. సంగారెడ్డి జిల్లాలో మంజీరా నది మీద నిర్మించిన సింగూర్ ప్రాజెక్ట్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.341 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి.

గతేడాది మంజీరా నది పరీవాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలు, ఎగువన కర్నాటక నుంచి వరద రావడంతో సింగూర్ ప్రాజెక్టులోకి 20 టీఎంసీలకుపైగా నీరు చేరింది. అయితే ప్రాజెక్టు డ్యామ్ లో భద్రతా లోపాలు, అప్‌స్ట్రీమ్ స్లోప్ రెవెట్‌మెంట్ దెబ్బతినడంతో రిపేర్లు చేపట్టాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించింది. దీంతో సింగూర్ ప్రాజెక్టుకు రిపేర్లు చేపట్టాలని నిర్ణయించిన అధికారులు పనులకు ఆటంకం ఏర్పడకుండా నిల్వ ఉన్న నీటిని దిగువకు వదిలారు. దీంతో సింగూర్ లో నీటి నిల్వ కనిష్ట స్థాయికి చేరుకుంది.

# ‘ఇరాన్‌పై దాడి విషయంలో సైన్యంతో విభేదాలు’.. ఖండించిన నెతన్యాహు!



ఇజ్రాయెల్‌లో ఎన్నికల వేళ.. ఇరాన్‌పై మరోసారి దాడి చేసే విషయమై ప్రధాని నెతన్యాహు, సైన్యం మధ్య విభేదాలు తలెత్తాయంటూ స్థానిక మీడియాలో వచ్చిన కథనాలు చర్చనీయాంశమయ్యాయి. ఒకవేళ దాడికి పాల్పడితే ఇరాన్ తో యుద్ధం మళ్లీ మొదలవుతుందంటూ ఇజ్రాయెల్ మిలిటరీ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారని పేర్కొన్నాయి. అయితే, ఈ కథనాలను ఫేక్ న్యూస్‌గా నెతన్యాహు కార్యాలయం కొట్టిపారేసింది. రక్షణశాఖ మంత్రి కాట్జ్ సైతం వాటిని ఖండించారు. ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడి చేసే ఉద్దేశం తమకు ఏమాత్రం లేదన్నారు. ఒకవేళ ఆ దేశం ముందుగా దాడి చేస్తే.. గట్టి జవాబు ఇస్తామని హెచ్చరించారు.
మరోవైపు, ఇజ్రాయెల్ ప్రతిపక్ష అభ్యర్థులు సంబంధిత కథనాలను ప్రస్తావిస్తూ.. నెతన్యాహును లక్ష్యంగా చేసుకున్నారు. తన రాజకీయ మనుగడ కోసం ప్రాంతీయ స్థిరత్వాన్ని ఆయన ప్రమాదంలో పడేస్తున్నారని ఆరోపించారు. దేశ భద్రత కంటే సొంత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే దుస్సాహసం చేయొద్దని నెతన్యాహు ప్రధాన ప్రత్యర్థి, సైన్యం మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ గాడీ ఐసెన్‌కోట్ హెచ్చరించారు. ఈ వ్యవహారంపై దేశద్రోహం కోణంలో దర్యాప్తు జరపాలని ఇజ్రాయెల్ బెయ్టెను పార్టీ అధినేత అవిగ్డోర్

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

మంగళవారం అక్టోబర్ 27, 2026

www.trinetnews.com

# తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర సీఎం సానుకూల స్పందన

**ముంబైలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం భేటీ**
**తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లుగా నిర్ణయించాలన్న తెలంగాణ ప్రతిపాదనపై కీలక చర్చలు**
**మహారాష్ట్రకు, తమ ప్రజలకు ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఒప్పందాన్ని పున:పరిశీలించేందుకు సిద్ధమన్న ఫడ్నవీస్**
**ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల చిరకాల సాగు, తాగునీటి ఆకాంక్షలను వివరించిన సీఎం రేవంత్ రెడ్డి**
**గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు 152 మీటర్ల ఎత్తు ఎందుకు అవసరమో వివరించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
**మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు ఆ రాష్ట్ర నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధం**
**ఆదిలాబాద్‌లో రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి ఊతమని వివరించిన సీఎం**
**రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటుకు మహారాష్ట్ర సీఎం ప్రతిపాదన**
**బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, సాంకేతిక అంశాలపై అధ్యయనం.. తదుపరి కార్యాచరణకు రోడ్ మ్యాప్**



**ముంబై, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:**
ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై కీలక చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై చర్చించారు.

సమావేశం ప్రారంభంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు.

ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్బి చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి.. వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామన్నారు.

2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే, ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమన్నారు. అందుకే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని తెలియజేశారు.

ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ--మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని తెలిపారు. అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని వివరించారు. ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నారు. రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున: పరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం (జకౌజ) తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు.

ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలన్నారు.

ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

**ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం**
హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని తెలిపారు. హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానన్నారు.

# కాళేశ్వరం నీళ్లపై కేటీఆర్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ కౌంటర్..
# 'కుంగిన బ్యారేజీల్లో నీళ్లు ఎలా నిల్వ చేస్తారు?'

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:**
కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం చైర్మన్, తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు పెట్టం నవీన్ తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. కమీషన్లకు కక్కుర్తిపడి లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, చివరకు దాని పరిస్థితిని దిగజార్చిన కల్వకుంట్ల కుటుంబం ఇప్పుడు కూడా బాధ్యతారహితంగా మాట్లాడుతోందని నవీన్ ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి 20 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసి ఒడిసిపట్టాలని కేటీఆర్ చెబుతున్నారని, అయితే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన విషయాన్ని ఆయన విస్మరిస్తున్నారని విమర్శించారు. నదిలో ప్రవహించే నీటిని ఎత్తిపోసి వినియోగించుకోవాలంటే అవసరమైన బ్యారేజీలు, నీటి నిల్వ సదుపాయాలు సురక్షితంగా ఉండాలని నవీన్ పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, సుందిళ్ల బ్యారేజీ వద్ద సీపేజీ సమస్యలు ఉన్నాయని ప్రస్తావిస్తూ, ఇలాంటి పరిస్థితుల్లో నీటిని ఎక్కడ నిల్వ చేస్తారని ప్రశ్నించారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదికలో పేర్కొన్న అంశాలను కేటీఆర్ గమనించాలని సూచించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి అన్నారం బ్యారేజీలో నిల్వ చేసినా, అక్కడ నీరు నిలవడం సాధ్యం కాదని ఎన్‌డీఎస్‌ఏ అభిప్రాయపడినట్లు నవీన్ పేర్కొన్నారు. అయితే ఈ వ్యాఖ్యలకు సంబంధించి నివేదికలోని నిర్దిష్ట సిఫార్సులు, సాంకేతిక వివరాలను అధికారిక పత్రాలతో పరిశీలించాల్సి ఉంది.

**గోదావరి జలాలను పూర్తిగా వినియోగిస్తున్నాం**
తెలంగాణ నుంచి గోదావరి నీరు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతోందంటూ కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నవీన్ తప్పుబట్టారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న నీటిని ప్రజల అవసరాలకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని, సీతారామ



ఎత్తిపోతల పథకం ద్వారా కూడా జలాలను వినియోగించుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి వినియోగించుకోలేకపోతున్నారంటూ కేటీఆర్ చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని నవీన్ అన్నారు. రాష్ట్రంలోని నీటి వనరులు, ప్రాజెక్టుల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించకుండా రాజకీయ విమర్శలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు.

**కాళేశ్వరం అంశంపై ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు'**
కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల సమస్యలను ప్రస్తావిస్తూ, వాటి భద్రతపై సాంకేతిక సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నవీన్ కోరారు. ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ, నీటి నిల్వ సామర్థ్యం వంటి అంశాలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందన్నారు. కేటీఆర్ ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితి లేదని నవీన్ వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో చోటుచేసుకున్న పరిణామాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం బీఆర్ఎస్ నాయకత్వానికి ఉందని అన్నారు.

# ప్రజలపై బీఆర్ఎస్ పార్టీ నేతలకు ప్రేమలేదు

**కరువు రావాలని బీఆర్ఎస్ కోరుకొంటుంది**
**ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టబర్ 26:**
రాజకీయం చేయాలనే ఆలోచనే తప్పా ప్రజలపై బీఆర్ఎస్ పార్టీ నేతలకు ప్రేమ లేదని భువనగిరి ఎంపీ, కాంగ్రెస్ పార్టీ నేత చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో కరువు రావాలని ఆ పార్టీ నేతలు కోరుకుంటున్నారని విమర్శించారు. అందుకోసం అబద్ధాలను వారు ప్రచారం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిమాక్ లేని దివానా మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్త చేశారు.గడ్డం పెంచి పెద్ద మనిషి అయ్యానని ఆయన అనుకుంటున్నారంటూ వ్యంగ్యంగా అన్నారు. మేడిగడ్డలో నీటిని నిల్వ చేసే పరిస్థితి లేదని పెదవి విరిచారు. ఎల్ నినో నేపథ్యంలో అక్టోబర్ 28వ తేదీన రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అందరి ఆలోచనల మేరకు నిర్ణయాం తీసుకుంటామని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్రైవింగ్ శిక్షణ దోహదం

**మందమర్రిలో డ్రైవింగ్ ట్రాక్‌ను పరిశీలించిన మంత్రి వివేక్ వెంకటస్వామి**



**మందమర్రి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:**
మహిళలు డ్రైవింగ్ నైపుణ్యాలను పెంపొందించుకుని, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మందమర్రిలోని సమ్మక్క సారలమ్మ మహిళా భవన్‌లో మహిళలకు డ్రైవింగ్ శిక్షణ అందించేందుకు
ఎంఓడబ్ల్యూఓ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న డ్రైవింగ్ ట్రాక్‌ను ఆయన సందర్శించి, శిక్షణ కోసం చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు, ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. డ్రైవింగ్‌లో నైపుణ్యం సాధించడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు స్వతంత్రంగా జీవించేందుకు మార్గం సుగమమవుతుందని తెలిపారు. మహిళలు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే కార్యక్రమాలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మందమర్రిలో ఏర్పాటు చేస్తున్న ఈ డ్రైవింగ్ శిక్షణ సదుపాయం మహిళలకు నైపుణ్యాభివృద్ధితో పాటు స్వయం ఉపాధి సాధనలో తోడ్పడనుంది.

# ఎల్ నినో ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :

**- జేపల్లి గ్రామపంచాయతీ ప్రజలకు ఫార్మర్ అడ్వైజర్ కమిటీ సభ్యురాలు కొర్రావత్ కవిత పవన్ నాయక్**

**ట్రైనెట్ న్యూస్, కల్వకుర్తి అక్టోబర్ 26 :**
ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు ముఖ్యంగా రైతులు అప్రమత్తం గా ఉండాలని జేపల్లి గ్రామపంచాయతీ ఫార్మర్ అడ్వైజర్ కమిటీ సభ్యురాలు కొర్రావత్ కవిత పవన్ నాయక్ సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ... రైతులు పంటల సాగు విషయంలో వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమ నించాలని సూచించారు. వర్షపాతం ఉష్ణోగ్రతల్లో మార్పులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచన లు సలహాలను పాటిస్తూ పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకో వడం ద్వారా నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎల్ ని నో ప్రభావం కారణంగా వర్షపాతంలో మార్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు నీటి వనరు లను పొదుపుగా వినియోగిం చుకో వాలని అందుబాటులో ఉన్న నీటిని అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా రైతులు పంటల ఎంపిక విత్తనాల వినియోగం సాగు విధానాల విషయంలో స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసు కోవాలని తెలిపారు. రైతుల సంక్షేమం పంటల రక్షణకు ముందస్తు అవగాహన ఎంతో ముఖ్యమని పేర్కొంటూ జేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులు ప్రజలు వాతావరణ పరిస్థితులను బట్టి తగిన జాగ్రత్తలు పాటించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# సేంద్రియ వ్యవసాయమే మేలు

**రైతులకు వ్యవసాయ సంచాలకులు డా. బి. గోపి సూచన**
**ఎల్‌నినో నేపథ్యంలో వరి వద్దు.. ఆరుతడి పంటలే ముద్దు;**
**ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా దుబ్బచెర్లలో క్షేత్రస్థాయి పర్యటన**
**పప్పుజాతి, నూనెగింజల పంటలను సాగు చేయాలి**
**పశుగ్రాసం కొరత రాకుండా స్వల్పకాలిక పశుగ్రాస పంటలు సాగు చేయాలని పిలుపు**





**హైదరాబాద్, త్రినేత్ర న్యూస్,**
అక్టోబర్ 26: ఖేత్ బచావో అభియాన్ -- సాగు భూమి సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి, ఐఏఎస్ సోమవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం దుబ్బచెర్ల గ్రామంలో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొని, రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గాయని, భూగర్భ జలాలు అడుగంటాయని సంచాలకులు తెలిపారు. రాబోయే ఏడెనిమిది నెలల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే సూచనలున్నందున, రైతులు ఈ యాసంగిలో వరి సాగు చేయవద్దని కోరారు. తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికొచ్చే ఆరుతడి పంటలను మాత్రమే ఎంచుకోవాలని, పప్పుజాతి, నూనెగింజల పంటలను సాగు చేయాలని సూచించారు.
మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టాలని, అంతర్జాతీయంగా గిరాకీ ఉన్న ఆయిల్ పామ్ సాగును చేపట్టాలని రైతులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉండటం వల్ల ఇక్కడి రైతులు పండించిన కూరగాయలకు అధిక డిమాండ్ ఉంటుందని, అధిక గిరాకీ ఉన్న పంటలు పండిస్తే మంచి ఆదాయం పొందవచ్చని వివరించారు.
ప్రస్తుత పరిస్థితుల్లో పశు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, పశుగ్రాసం కొరత రాకుండా స్వల్పకాలిక పశుగ్రాస పంటలు సాగు చేయాలని కోరారు.
పంట సాగులో నేల సంరక్షణే అత్యంత కీలకమని సంచాలకులు అన్నారు. నేలను కాపాడుకుంటేనే దిగుబడులు, రైతు ఆదాయం పెరుగుతాయని, భావితరాలకు సాగుయోగ్యమైన భూమిని అందించగలమని చెప్పారు. సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, వ్యవసాయ శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన మేరకే వాడుతూ, క్రమంగా వాటిపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం రైతులకు, నేలకు మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. వీలైతే ప్రతి రైతు కనీసం ఒక ఎకరంలో రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం చేయాలని, సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, పండ్లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని తెలిపారు.
రైతు క్షేత్రం సందర్శన
సమావేశం అనంతరం సంచాలకులు గ్రామానికి చెందిన రైతు శ్రీ సీతారాములు క్షేత్రాన్ని సందర్శించారు. సొంతంగా 10 ఎకరాలు, కౌలుకు తీసుకున్న 15 ఎకరాలు కలిపి మొత్తం 25 ఎకరాల్లో ఆయన ఈత, ఆయిల్ పామ్, వరి, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. పంటల పరిస్థితిని పరిశీలించిన సంచాలకులు, సాగు విధానాలు, ఎదురవుతున్న సమస్యల గురించి రైతుతో ముచ్చటించి అడిగి తెలుసుకున్నారు.
విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ప్రతిజ్ఞ
కేంద్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి నవంబర్ 1 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తోంది. 'సమగ్రతతో సుసంపన్నత' అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ వారోత్సవాల ఉద్దేశం అవినీతి నిర్మూలన, పారదర్శకత, నైతిక విలువలను పెంపొందించడం. ఇందులో భాగంగా సంచాలకులు, అధికారులు, రైతులతో కలిసి సమగ్రత ప్రతిజ్ఞ చేశారు.
ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి సుజాత, కృషి విజ్ఞాన కేంద్రం సంచాలకులు డా. చంద్రకాంత్, ఉద్యాన విషయ నిపుణులు శ్రీ శ్రీకృష్ణ, పశువైద్య విషయ నిపుణులు డా. సుధీర్, జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి డా. దిలీప్, మహేశ్వరం సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారి, సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# చెన్నూరును పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

**రూ.70 కోట్లతో గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులు -- మంత్రి వివేక్ వెంకటస్వామి**



**చెన్నూరు, త్రినేత్ర న్యూస్, అక్టబర్ 26:**
చెన్నూరు పట్టణాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నామని పేర్కొన్నారు. చెన్నూరులో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు నూతన పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**చిరువ్యాపారులకు ఆధునిక దుకాణాలు**
చిరువ్యాపారుల ప్రయోజనాలను కాపాడే లక్ష్యంతో రూ.1.20 కోట్ల వ్యయంతో 20 దుకాణాల నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ దుకాణాలను నాలుగు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మిగిలిన అర్హులైన చిరువ్యాపారుల కోసం మరో 50 ఆధునిక దుకాణాలను నిర్మించి అందిస్తామని వెల్లడించారు. దీనివల్ల చిరువ్యాపారులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు వారి జీవనోపాధికి భరోసా లభిస్తుందని అన్నారు.

**రహదారులు, డ్రైనేజీ పనులకు ప్రాధాన్యం**
చెన్నూరు పట్టణంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.1.50 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు. ప్రధాన రహదారి విస్తరణ పనులను మరో మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. 10వ వార్డులో రూ.3.50 కోట్లతో 750 మీటర్ల మేర రోడ్డు విస్తరణ, డబుల్ ఆర్మ్ సెంట్రల్ లైటింగ్ పనులు చేపడుతున్నామని చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

**గోదావరి పుష్కరాలకు రూ.70 కోట్ల నిధులు**
గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని చెన్నూరు అభివృద్ధికి రూ.70 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా గోదావరి తీరంలోని శివాలయాన్ని రూ.17 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పుష్కర ఘాట్లకు వెళ్లే రహదారి నిర్మాణానికి రూ.6 కోట్లు, పోచమ్మ గుడి వద్ద భక్తులకు అవసరమైన వసతుల కల్పనకు రూ.2 కోట్లు, మహాశివరాత్రి సందర్భంగా జైపూర్‌కు వెళ్లే భక్తుల సౌకర్యాల కోసం మరో రూ.2 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అలాగే, జైపూర్ మండలం వేళాల గ్రామంలో రూ.4.25 కోట్లతో గోదావరి పుష్కర ఘాట్ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**పర్యాటక సర్క్యూట్‌తో ఉపాధి అవకాశాలు**
చెన్నూరు శివాలయం, క్రొకడైల్ పార్క్, కాళేశ్వరం ప్రాంతాలను అనుసంధానిస్తూ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఈ ప్రణాళిక ద్వారా చెన్నూరుకు పర్యాటకుల రాక పెరగడంతో పాటు స్థానిక వ్యాపారాలకు ప్రోత్సాహం లభిస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.
రహదారి విస్తరణ పనులకు స్వచ్ఛందంగా సహకరిస్తున్న ప్రజలకు, వ్యాపారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సహకారంతో చెన్నూరు పట్టణ రూపురేఖలను మార్చి, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన, ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి, పర్యాటక రంగానికి ప్రోత్సాహం ద్వారా చెన్నూరును సమగ్ర అభివృద్ధి దిశగా నడిపిస్తామని మంత్రి వెల్లడించారు.

# నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం

**10రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లుల చెల్లింపు**
**పాలేరు నియోజవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి వెల్లడి**



**ఖమ్మం, త్రినేత్ర న్యూస్, అక్టోబర్ 26:**
పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లిలో ఉన్న 3వ శతాబ్దానికి చెందిన చారిత్రక బౌద్ధ స్తూపాన్ని, పరిసర ప్రాంతాలను అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం నేలకొండపల్లిలో పర్యాటక సదుపాయాల కల్పన, బౌద్ధ స్థల సంరక్షణ, పునరుద్ధరణ పనులకు మంత్రి శంకుస్థాపన వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 3 వ శతాబ్దానికి చెందిన బౌద్ధ స్థూపాన్ని సుమారు 50-55 సంవత్సరాల క్రితం నేలకొండపల్లి గ్రామంలో గుర్తించారని, దేశంలోనే అత్యంత పెద్ద బౌద్ధ స్తూపాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధిని ప్రారంభించినప్పటికీ పనులు పూర్తి చేయలేకపోయాయని అన్నారు. స్తూపం చుట్టూ ఉన్న ఒకటిన్నర కిలోమీటరు పరిధిలో పురావస్తు శాఖ అధికారులు గతంలో జరిపిన తవ్వకాల్లో ఎన్నో పురాతన వస్తువులు లభ్యమయ్యాయని, వాటిని భద్రపరిచేందుకు స్థానికంగా వసతులు లేకపోవడంతో హైదరాబాద్ మ్యూజియంలో ఉంచారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచవ్యాప్తంగా వచ్చిన బౌద్ధ మతస్థులు, స్థానికుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని, రాబోయే రోజుల్లో బౌద్ధ కట్టడాలపై అవగాహన ఉన్న ప్రముఖ నిపుణులను, అధికారులను ఇక్కడికి ఆహ్వానించి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు.తన పాలేరు నియోజకవర్గంలో మంత్రి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడమేగాక వివిధ ప్రగతి పనులకు శంకుస్థాపనలు చేశారు.

**10రోజుల్లో ఫైనల్ బిల్లుల చెల్లింపులి**
రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైనల్ బిల్లులన్నింటినీ రాబోయే 10 రోజుల్లోగా లబ్ధిదారుల ఖాతాల్లో ఎలాంటి లంచాలకు తావు లేకుండా జమ చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి పొంగులేటి ప్రకటించారు. నేలకొండపల్లి రైతు వేదికలో నేలకొండపల్లి మండల లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేలకొండపల్లి మండలంలో మొదటి విడత కింద మంజూరైన 648 ఇళ్లలో సుమారు 620 ఇళ్లు పూర్తయ్యాయని, వివిధ కారణాల వల్ల మిగిలిన ఇళ్లను కూడా త్వరలోనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, కరెంటు, నీటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో రైతన్నలు నష్టపోకూడదనే ఉద్దేశంతో రెండో పంట వేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు మంత్రి అన్నారు. అంతకుముందు మంత్రి నేలకొండపల్లి మండలం అనాసాగరం నుండి పమ్మి వరకు 2.5 కిలోమీటర్ల మేర 2.80 కోట్ల అంచనా వ్యయంతో బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు.పాలేరు నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై అన్ని ఇంజనీరింగ్ శాఖల అధికారులతో మంత్రిగారు సమీక్షా సమావేశం నిర్వహించారు. కుసుమంచి మండలం, గోరిళ్లపాడు తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని మంత్రి పొంగులేటి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర టిఎస్ , హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల ఎంపీడీవో ఎర్రయ్య, తహశీల్దార్ రాంప్రసాద్, స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.
మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీలోని నాయుడుపేట జంక్షన్, టి.సి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం-వరంగల్-నల్గొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశానికి హాజరయ్యారు.

# గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం





**హైదరాబాద్ , త్రినేత్ర న్యూస్, అక్టోబర్,26.**
గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం విషయంలో ఎన్నికల కమిషన్ కానీ, రాష్ట్ర ప్రభుత్వం కానీ తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని మాజీమంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన సనత్ నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం మీడియా తో మాట్లాడారు. నవంబర్ 6 వ తేదీన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం ముగుస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. కాలనీలు, బస్తీలు, అపార్ట్ మెంట్ లలో పాదయాత్ర గా తిరుగుతూ ఇంటింటికీ వెళ్ళి అర్హులైన గ్రాడ్యుయేట్ లను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు కార్యక్రమం బాధ్యత ఎన్నికల కమిషన్ పై ఉన్నప్పటికీ పట్టించుకోని కారణంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బి ఎల్ ఓ లను కూడా నియమించలేదని మండిపడ్డారు. గత గ్రాడ్యుయేట్ ఎన్నికలలో హైదరాబాద్ నగర పరిధిలో ఒక లక్ష 10 వేల మంది గ్రాడ్యుయేట్ లు ఓటర్లుగా నమోదు కాగా, ప్రస్తుతం ఇప్పటి వరకు 23 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గ్రాడ్యుయేట్ ల నుండి ఓటరు నమోదు పత్రాలు స్వీకరించి అధికారులకు అందజేస్తే అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం కూడా ఏ మాత్రం బాధ్యతగా వ్యవహరించడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ అసమర్ధ పాలన వలన ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పాలనను గాలికొదిలి రాష్ట్రాల పర్యటన లు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఓటరు నమోదు కార్యక్రమం నియోజకవర్గ ఇంచార్జి గోసుల శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, టి. మహేశ్వరి, అత్తిలి అరుణ గౌడ్, కుర్మ హేమలత, డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు గందే నాగులు, టి. శ్రీహరి, ప్రవీణ్ రెడ్డి, నరేందర్, లక్ష్మీపతి, ఏసూరి మహేష్, కరుణాకర్ రెడ్డి, కొండాపురం మహేష్ యాదవ్, అశోక్ యాదవ్, మల్లారెడ్డి, ప్రేమ్, అబ్బాస్, గుడిగే శ్రీనివాస్ యాదవ్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ యుద్ధాలకు సన్నద్ధంగా సైనిక వ్యవస్థల ఆధునికీకరణ డిసెంబర్ 14, 15 తేదీల్లో చండీమందిర్‌లో మెకనైజేషన్ టెక్నాలజీ సెమినార్ ఢిల్లీలో సన్నాహక కార్యక్రమాన్ని ప్రారంభించిన లెఫ్టినెంట్ జనరల్ పుష్పేంద్ర సింగ్

**న్యూఢిల్లీ, త్రినేత్ర న్యూస్, అక్టోబర్ 26:**




ప్రస్తుత సైనిక వాహనాలు, యుద్ధ వ్యవస్థలను అధునాతన సాంకేతికతతో ఆధునీకరించి, భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా పశ్చిమ కమాండ్ ఆధ్వర్యంలో మెకనైజేషన్ టెక్నాలజీ సెమినార్--2.0 నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన సన్నాహక కార్యక్రమాన్ని సోమవారం న్యూఢిల్లీలోని మానెక్‌షా సెంటర్‌లో పశ్చిమ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్--ఇన్--చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ పుష్పేంద్ర సింగ్ ప్రారంభించారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడీఎం) సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.
'చక్ర--భవిష్యత్ పోరాటాల కోసం ప్రస్తుత యుద్ధ వ్యవస్థల పరివర్తన' ఇతివృత్తంతో డిసెంబర్ 14, 15 తేదీల్లో చండీమందిర్ మిలిటరీ స్టేషన్‌లో ప్రధాన సదస్సు జరగనుంది. భారత సైన్యం, రక్షణ పరిశ్రమలు, విద్యా--పరిశోధన సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొని యాంత్రీకృత దళాల సామర్థ్యాల పెంపు, సాంకేతిక పురోగతిపై చర్చించనున్నారు.
పోరాట సామర్థ్యం పెంపు, సాంకేతిక వినియోగం, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవస్థల మార్పు, దాడి సామర్థ్యం, పునరుద్ధరణ, రక్షణ రంగంలో స్వావలంబన వంటి అంశాలపై సదస్సు దృష్టి సారించనుంది. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సామర్థ్య లోటుపాట్లు, అవసరాలను స్పష్టమైన సమస్య నిర్వచన పత్రాలుగా రూపొందించి, వాటికి ఆచరణ సాధ్యమైన సాంకేతిక పరిష్కారాలను గుర్తించనున్నారు.
సన్నాహక కార్యక్రమంలో సదస్సు లక్ష్యాలు, ప్రధాన చర్చనీయాంశాలను వివరించారు. సాంకేతిక ఆధారిత ఆధునికీకరణ, పౌర--సైనిక భాగస్వామ్యం, దేశీయ రక్షణ సామర్థ్యాల బలోపేతంలో ఆత్మనిర్భరత ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. ప్రస్తుత యుద్ధ వ్యవస్థల ఆధునికీకరణ, స్వదేశీ ఆవిష్కరణలు, కొత్త కార్యాచరణ అవసరాలపై సైనిక అధికారులు, పరిశ్రమలు, విద్యా సంస్థల ప్రతినిధులు అభిప్రాయాలు పంచుకున్నారు.
మారుతున్న యుద్ధక్షేత్ర పరిస్థితుల్లో యాంత్రీకృత దళాల కార్యాచరణ సామర్థ్యం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే శక్తి, పోరాట సన్నద్ధతను పెంచేందుకు ఈ సదస్సు దోహదపడనుంది. సాయుధ దళాలు, రక్షణ పరిశ్రమలు, విద్యా సంస్థల సమన్వయంతో సైనిక అవసరాలను అమలు చేయగల సాంకేతిక పరిష్కారాలుగా మలచడం దీని ప్రధాన ఉద్దేశం.

త్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

మంగళవారం అక్టోబర్ 27, 2026

www.trinetnews.com

## మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు 28న ధ్రువపత్రాల పరిశీలన, వ్రాత పరీక్ష,

**• మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**



జిల్లా పరిధిలో జాతీయ ఆయుష్ మిషన్ క్రింద ఆయుష్ పబ్లిక్ హెల్త్ కార్యక్రమాల నిర్వహణకు అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 28వ తేదీన ధ్రువపత్రాల పరిశీలన తో పాటు వ్రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, అనంతరం ఉదయం 11 గంటలకు వ్రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నిర్ణీత తేదీ, సమయానికి అవసరమైన ధ్రువపత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

## ఎల్ నినో దృష్ట్యా ఆరుతడి పంటలు సాగు చేయాలి

యాసంగిలో వరి పంట సాగు చేయకుండా,దానికి బదులుగా ఆరుతడి పంటలైన శనగలు, మినుములు,పెసర్లు,జొన్నలు, వేరుశనగ వంటి పంటలను సాగు చేయాలని నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల వ్యవసాయాధికారి రెహనా రైతన్నలను కోరారు.సోమవారం మండలంలోని రామంతపూర్ గ్రామానికి చెందిన కొండల్ రెడ్డి పొలాన్ని సందర్శించి,సాగు చేస్తున్న మినుము,ఉలవ,పెసర పంటలను పరిశీలించారు.తక్కువ నీటి వినియోగం,తక్కువ పెట్టుబడితో పప్పుధాన్య పంటలను సాగు చేయడం పట్ల రైతు సంతృప్తిని వ్యక్తం చేసినట్లు ఎంఏఓ రెహనా పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో



వర్షాభావ పరిస్థితులు ఏర్పడి,భూగర్భ జలమట్టాలు తగ్గిపోతున్నాయని,దీనివల్ల భవిష్యత్తులో తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయన్నారు.ప్రస్తుతం బోర్లలో నీరు ఉన్నప్పటికీ,వరి సాగు చేసిన తర్వాత బోర్లు ఎండిపోయి పంటకు నీరు అందించలేని పరిస్థితి ఏర్పడితే రైతులు పెట్టిన పెట్టుబడి రాక,రైతు నష్టపోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు.కాబట్టి రైతులు భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని,నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని,యాసంగిలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలైన శనగలు, మినుములు,పెసర్లు,జొన్నలు, వేరుశెనగ వంటి పంటలను సాగు చేసుకోవాలని రైతంగానికి పిలుపునిచ్చారు.

## 14 నామినేషన్లు ఉపసంహరణ ఎన్నికల అధికారి జి స్వాతి వెల్లడి



మొగల్తూరు మండలంలో జరుగుతున్న ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియలో సోమవారం 14 మంది పోటీ చేసే అభ్యర్థులు ఉపకాహరణ చేసుకున్నారని మొగల్తూరు మండల ఎన్నికల అధికారి జి స్వాతి అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మొగల్తూరు మండలంలో మొత్తము 111 మంది నామినేషన్లు వేయగా వానిలో ఆదివారం 2 సోమవారం 14 మంది అభ్యర్థులు ఉపసంహరణ చేసుకున్న వారిలో ఉన్నారని స్వాతి తెలిపారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు మంగళవారం మూడు గంటలు దాటిన తర్వాత ఎన్నికల గుర్తులు కేటాయించనున్నట్లు ఆమె తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలోపు అభ్యర్థులకు ఉపసంహరణ గడువు గలదని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో మొగల్తూరు మండల ఎన్నికల రిటర్నింగ్ అసిస్టెంట్ అధికారి సిహెచ్ త్రిశూలపాణి, అబ్దుల్ ఫరూక్, ఎంపీడీవో కార్యాలయ సూపరిడెంట్ ఎన్.ఎస్. ఎన్ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో లు మేడిద నవీన్ కిరణ్, నూకల వెంకట సూర్యనారాయణ, సిబ్బంది మోకా శ్రీనివాస్ రావు శ్రీకాంత్, మారంపూడి మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

## తట్టివర్రు హైపర్ సెన్సిటివ్ గ్రామంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



తట్టివర్రు హైపర్ సెన్సిటివ్ గ్రామంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైపర్ సెన్సిటివ్ గ్రామమైన తట్టివర్రు లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ సీఐ ఎస్ ఎల్ ఆర్ సోమేశ్వరరావు, ఎస్ఐ ఎన్నో . చంటిబాబు, ఎస్ఐ-2 పి. ప్రకాశరావు మరియు గుడివాడ రూరల్ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో శాంతిభద్రతలను కాపాడేందుకు, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామ ప్రజలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని, పోలీసులకు సహకరించాలని సూచించడం జరిగింది.

## కండక్టర్ ప్రవళికను పరామర్శించిన టీజేఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్



సాయి సంజీవిని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మణుగూరు డిపో కండక్టర్ ప్రవళికను పరామర్శించిన టీజేఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, డిఎస్ఎన్ఆర్ డిపో కార్యదర్శి బి.యన్.రెడ్డి,సిటీ రిజినల్ ప్రెసిడెంట్ రాజయ్య, హెచ్వై టి డిపో సెక్రటరీ కేఆర్ఎం రావ్ తదితరులు పరామర్శించారు.అదేవిధంగా ప్రవళిక తల్లి విజయ లక్ష్మి ని ,ఆస్పత్రికి వచ్చిన ఈడి వెంకన్న ని,ఈడి సోలోమన్ ని ,ఖమ్మం ఆర్ఎం సాయిరాం ని, ఆర్ఎం శ్రీనాథ్ ని, అనంతరం ఆస్పత్రి సూరింటెండెంట్ ని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఆమె ఆరోగ్యం క్లిష్టంగా ఉందని వైద్యులు తెలిపారు. యాజమాన్యం వెంటనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## రూ.1.25 కోట్లతో నిర్మించిన నూతన ఆడిటోరియం



**ప్రారంభించిన పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి**

గండీడ్ మండల కేంద్రంలో రూ.125 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆడిటోరియంను పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.అనంతరం గండీడ్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను గండేడ్ మండల అధ్యక్షులు గంగుల అనంత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.1,00,116 చొప్పున మొత్తం 30 మంది లబ్ధిదారులకు రూ.30,03,480 విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు.రూ.1.25 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన ఆడిటోరియం మండల ప్రజలకు వివిధ సమావేశాలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మన సంస్కృతి, కళలు ఎంతో గొప్పవని, వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం

మన సంస్కృతి, కళలు ఎంతో గొప్పవని, వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ లోని హరి హర కళా భవన్ లో లాలి నిధి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో 9 గంటల నిరంతర కూచిపూడి నృత్య ప్రదర్శనకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా లాలి నిధి, ఆమె బృందం నృత్య







ప్రదర్శనను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. ఇంత గొప్ప కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విదేశాలలో మన సంస్కృతి, సాంప్రదాయాలను ఎంతో గొప్పగా ఆచరిస్తుంటే, మన దగ్గర కొందరు పాటించకపోవడం బాధాకరం అన్నారు. ప్రభుత్వం కూడా సాంప్రదాయ కళలను ప్రోత్సహించాలని అన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నతనం నుండే లాలి నిధి కూచిపూడి, ఇతర నృత్యాలలో అనేక ప్రదర్శనలు నిర్వహించి రాణిస్తూ అనేక అవార్డులు సొంతం చేసుకుందని పేర్కొన్నారు. ప్రముఖ కవి డాక్టర్ సి. నారాయణ రెడ్డి చేతుల మీదుగా లాలి బిరుదు ను అందుకున్న నిధి లాలి నిధి అకాడమీ ని ఏర్పాటు చేసి అనేకమందికి కూచిపూడి నృత్యం లో శిక్షణ ఇవ్వడం అభినందనీయం అన్నారు. నిరంతరాయంగా 9 గంటల పాటు నృత్య ప్రదర్శన చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలో కూడా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం నిర్వాహకులు స్వర్ణ, వెంకటేష్ దంపతులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను ఘనంగా సన్మానించి మెమెంటో ను అందజేశారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు టి. శ్రీహరి, అఖిల్ తదితరులు ఉన్నారు.

## పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం






పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా, చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మట్టుగూడలోని ఓం సాయి విద్యా నికేతన్ హై స్కూల్ విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, పోలీస్ స్టేషన్ పనితీరు, ఆధునిక పోలీసింగ్ విధానాలు మరియు ప్రజల భద్రత కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఫ్రెండ్లీ పోలీసింగ్, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్స్ (ముఖ గుర్తింపు వ్యవస్థలు), సీసీటీవీ నిఘా వ్యవస్థ, వేలిముద్రల విశ్లేషణ, షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, పోర్ట్రెయిట్ పార్లే మరియు బీట్ సిస్టమ్ వంటి ముఖ్యమైన పోలీసింగ్ విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించడం జరిగింది.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నేరాల నివారణ, నేరస్తుల గుర్తింపు, నేర పరిశోధన మరియు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ పోషిస్తున్న పాత్రను పోలీస్ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్స్, సీసీటీవీ కెమెరాలు మరియు వేలిముద్రల విశ్లేషణ నేర పరిశోధనలో ఏ విధంగా ఉపయోగపడతాయో తెలియజేశారు.మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్ మరియు భరోసా కేంద్రాలు అందించే సేవలు, రక్షణ మరియు సహాయ కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే ఫ్రెండ్లీ పోలీసింగ్, బీట్ సిస్టమ్ ద్వారా ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావడం, ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించడం, స్థానికంగా భద్రతను మెరుగుపరచడం వంటి అంశాలను వివరించారు. నిందితుల గుర్తింపులో పోర్ట్రెయిట్ పార్లే విధానం ఉపయోగాన్ని కూడా విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, చట్టాల పట్ల గౌరవం, ప్రజా భద్రత, నేరాల నివారణలో సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించడం జరిగింది.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పోలీస్ శాఖ పనితీరుపై విలువైన అవగాహన పొందారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ మరియు పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాల బలోపేతానికి చిలకలగూడ పోలీస్ స్టేషన్ చేస్తున్న కృషిని తెలుసుకున్నారు.

## మానవాళి ఆరోగ్య సవాళ్లకు వైద్య పరిశోధనలే పరిష్కారం డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ రూబీ జూబ్లీ వేడుకల్లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్




**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:**
మానవాళి ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లకు పరిష్కారాలు కనుగొనే దిశగా వైద్య సంస్థలు పరిశోధనలను బలోపేతం చేయాలని భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ అత్యవసర ఆరోగ్య సమస్యలకు సమర్థమైన పరిష్కారాలను అభివృద్ధి చేయాలని సూచించారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ 40వ వార్షికోత్సవం--రూబీ జూబ్లీ వేడుకల్లో ఆయన ప్రసంగించారు.
డాక్టర్ ఎన్టీఆర్ భారతదేశం గర్వించదగిన మహనీయుడని ఉపరాష్ట్రపతి కొనియాడారు. ప్రాంతీయ సరిహద్దులకు అతీతంగా ఆలోచించిన నాయకుడిగా ఆయనను అభివర్ణించారు.
సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి సేవ చేయాలని, వైద్య సేవలకు కరుణే ప్రధాన ఆధారమని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సమాజం సాగించే పోరాటంలో వైద్యులు ముందుండి నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు.

## మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య

చేగుంట గ్రామానికి చెందిన టేకి నర్సింలు తండ్రి గౌరయ్య, వయసు 21 సం.లు, కులం బేడ బుడగ జంగం, వృత్తి కూలి పని గారు సుమారు రెండు సంవత్సరాల నుండి మద్య త్రాగుటకు బానిసై,నిన్న తేదీ 25.10. 2026 నాడు రాత్రి అందాజా ఎనిమిది గంటలకు బాగా మద్యం తాగి ఇంటికి వచ్చి తన తల్లితో గొడవ పడి ఇంట్లో నుండి వెళ్ళిపోయి వడియారం రైల్వే స్టేషన్ సమీపంలో గల వెంచర్ వద్ద చెట్టుకు చీర తో ఉరివేసుకొని చనిపోయినాడు ఇట్టి విషయములో మృతుని తల్లి టేకి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించానైనది

# మిల్లర్లపై కేసులు సరే... అధికారుల సంగతేంటి..?

**మిల్లర్ల అవినీతిలో డిఎస్ఓ, డిఎంల ప్రమేయం లేదా?**
**అధికారుల పాత్రపై కూడా విచారణ చేపట్టాలి**
**అవినీతి అధికారుల చిట్టాను**
**ఏసీబీ, సీఐడీ కి అందజేస్తాం**
**బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్**



**హైదరాబాద్, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 26:**
రాష్ట్రంలో అవినీతికి పాల్పడిన సివిల్ సప్లయ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి అక్రమాస్తులు కూడా జప్తు చేయాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో మీడియాతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో మిల్లర్లపై జరుగుతున్న దాడులు, కేసుల నమోదు వంటి అంశాలను బీసీ పొలిటికల్ జెఏసి స్వాగతిస్తుందని అన్నారు.
అధికారుల సహకారం, అండదండలు లేకుండా మిల్లర్లు సొంతంగా అవినీతికి ఎలా పాల్పడతారని ప్రశ్నించారు. నేడు సివిల్ సప్లయ్ శాఖలో కోట్ల రూపాయల అవినీతి బాగోతం కొనసాగుతుందంటే అందుకు ప్రధాన కారణం అవినీతి అధికారులు కాదా? అని నిలదీశారు. ఇటీవల వనపర్తి జిల్లాలో అనుమతులు లేవంటూ రెండు రైస్ మిల్లులను కూల్చివేశారని గుర్తు చేస్తూ, అనుమతులు లేని రైస్ మిల్లులకు ధాన్యం ఎలా కేటాయించారు? మిల్లింగ్ అనుమతులు ఎవరు ఇచ్చారని, ఈవిధమైన అవినీతి చర్యలకు అధికారులు కారణం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సివిల్ సప్లయ్ శాఖలో పనిచేస్తున్న అనేక మంది డిఎం మరియు డిఎస్ఓలు కోట్లకు పడగెత్తుతున్నారని, ఒక్క సీజన్లో ఒక్కో అధికారి రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు అక్రమంగా సంపాదించుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.
మిల్లర్లపై జరుగుతున్న దాడుల విధంగానే అధికారులపై కూడా ఏసీబీ, సిఐడి సోదాలు నిర్వహించాలని, అవినీతి అధికారుల అవినీతి చిట్టాను త్వరలో అందజేస్తామని, వారి అక్రమాస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో, వారి బినామీలు ఎవరో గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతి అధికారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని, అక్రమ సంపాదన ఒక్కటే కాకుండా ధాన్యం సేకరణ, ట్రక్ షీట్లు, ధాన్యం నిల్వలు, టెండర్ ప్రక్రియ, రవాణా బిల్లులు, బ్యాంకు చెల్లింపులు, స్టాక్ ధ్రువీకరణ పత్రాలు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియామకాల వంటి వ్యవహారాలలో అధికారులు అనేక అవకతవకలకు పాల్పడుతూ అవినీతిలో కూరుకుపోతున్నారని అన్నారు. అవినీతి అధికారుల భరతం పట్టే వరకు బీసీ పొలిటికల్ జేఏసీ విశ్రమించదని, ప్రభుత్వం అవినీతి అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జెఏసి నాయకులు వివి గౌడ్, దేవర శివ, సిద్ధార్థ్, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆరోగ్య శాఖ అప్రమత్తం!

**107 ఆసుపత్రుల్లో జనరేటర్ల ఏర్పాటు.. రూ.21.96 కోట్ల నిధులు విడుదల**
**ఆసుపత్రుల్లో నీటి సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు.. భారీ సామర్థ్యం కలిగిన ట్యాంకుల ఏర్పాటుపై దృష్టి**





**హైదరాబాద్, అక్టోబర్ 26(జై భీమ్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య శాఖ మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారిస్తోంది. ఆసుపత్రుల్లో విద్యుత్ సరఫరా అంతరాయాలు, నీటి కొరత కారణంగా రోగులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టడం ప్రాధాన్యతగా మారింది. ఈ క్రమంలో ఎల్ఎన్ఓ పర్యవేక్షణతో పాటు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

**జనరేటర్ల కొనుగోలుకు రూ.21.96 కోట్లు**
2025 జూలై 3న జనరేటర్ల కొనుగోలుకు రూ.21.96 కోట్ల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 107 ఆసుపత్రుల్లో విద్యుత్ బ్యాకప్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.
ఈ మేరకు తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) డీజిల్ జనరేటర్ల కొనుగోలుకు టెండర్లు పిలిచింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సందర్భాల్లో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా జనరేటర్లు ఉపయోగపడనున్నాయి.

**ఆసుపత్రుల్లో నీటి సమస్యకు పరిష్కారం**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో నీటి కొరత వల్ల రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోకుండా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. పెద్ద సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకులను ఏర్పాటు చేయడం ద్వారా నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పుడు ఆసుపత్రుల అవసరాలను తీర్చేందుకు అవకాశం ఉంటుంది.

**ఎల్ఎన్ఓ పర్యవేక్షణతో ముందస్తు చర్యలు**
ఆసుపత్రుల్లో విద్యుత్, నీటి సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టడం కీలకం. జనరేటర్లు సక్రమంగా పనిచేస్తున్నాయా? నీటి ట్యాంకుల్లో తగినంత నిల్వ ఉందా? అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు ఉన్నాయా? అనే అంశాలను నిరంతరం పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**రోగుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం**
నిధుల విడుదల, టెండర్ల ప్రక్రియతోపాటు జనరేటర్ల ఏర్పాటు, నీటి ట్యాంకుల నిర్మాణం లేదా సామర్థ్య పెంపు పనులు నిర్ణీత సమయంలో పూర్తిచేయడం ముఖ్యం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడితే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది.
ఆసుపత్రుల్లో విద్యుత్, నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ రోగులకు నిరంతర వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు..

**జీవక స్టీల్ ఫ్యాక్టరీ వద్ద స్థానికుల ఆందోళన.. కాలుష్య నివారణ చర్యలు చేపడతామని యాజమాన్యం హామీ**



చేగుంట మండల కేంద్రం : పరిశ్రమల నిర్వహణలో ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సూచించారు. చేగుంట మండలంలోని జీవక స్టీల్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో కాలుష్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు వ్యక్తం చేసిన ఆందోళనకు ఆయన స్పందించారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.
జీవక స్టీల్ ఫ్యాక్టరీ వల్ల గాలి, నీరు, భూమి కాలుష్యానికి గురవుతున్నాయని ఆరోపిస్తూ అనంత సాగర్, ఉల్లి తిమ్మాయిపల్లి, కొండాపూర్, గొల్లపల్లి, చేగుంట, బోనాల, పులి మామిడి, పొలంపల్లి, చిన్న శివనూర్, కర్నాల్ పల్లి, మక్కారాజ్ పేట, కరీంనగర్ తదితర గ్రామాల రైతులు, స్థానిక ప్రజలు ఫ్యాక్టరీ ఎదుట వంటావార్పు, రాస్తారోకో తదితర నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆందోళన కొనసాగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే అక్కడికి చేరుకుని స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ..**
తాము పరిశ్రమలకు వ్యతిరేకం కాదని, ప్రాంత అభివృద్ధికి దోహదపడే మరిన్ని పరిశ్రమల ఏర్పాటును స్వాగతిస్తామని తెలిపారు. అయితే పరిశ్రమల నిర్వహణ వల్ల ప్రజల ఆరోగ్యం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జీవక స్టీల్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో గాలి, నీటి నాణ్యతపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, ఫ్యాక్టరీ నుంచి తరలించే మట్టి కారణంగా కూడా పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని వారు పేర్కొంటున్నారని తెలిపారు. దుమ్ము, ధూళి కారణంగా రహదారి ప్రయాణంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. నీటి నాణ్యతలో మార్పుల వల్ల వ్యవసాయంపై ప్రభావం పడుతోందని రైతులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు..
ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన భద్రతా సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. కార్మికులకు భద్రతా పాదరక్షలు, హెల్మెట్లు, రక్షణ దుస్తులు, తాగునీరు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలతో పాటు బీమా కల్పించాలని కోరారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పరిసర గ్రామాల్లో సీఎస్ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని యాజమాన్యానికి సూచించారు..
ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ యజమాని మోహన్ అగర్వాల్ ప్రజల సమక్షంలో ఎమ్మెల్యేతో చర్చించారు. కాలుష్య నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని, స్థానిక కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, పరిసర గ్రామాల్లో సీఎస్ఆర్ నిధుల

# ప్రతినిత్యం యోగా చేయండి -- ఆరోగ్యంగా ఉండండి




శేరిలింగంపల్లి గుల్మోహర్ పార్కులో తొమ్మిదేళ్లుగా నిరంతరాయంగా ఉచిత యోగా శిక్షణ నిర్వహిస్తున్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే వి.జగదీశ్వర్ గౌడ్, బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ పిలుపునిచ్చారు. గుల్మోహర్ పార్కులో ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా వి.జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ తమ ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా 30 నుంచి 60 నిమిషాల వరకు యోగా, ప్రాణాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు. చిన్నతనం నుంచే యోగాపై అవగాహన పెంచుకుంటే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని అన్నారు. బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ... యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, శరీరాన్ని, మనసును సమతుల్యంగా ఉంచే గొప్ప జీవన విధానమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక ఉల్లాసం, శారీరక చురుకుదనం పెరుగుతాయని, ఒత్తిడిని నియంత్రించుకోవడానికి, ఏకాగ్రతను మెరుగుపరుచుకోవడానికి, ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించడానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో పని ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలి కారణంగా అనేకమంది ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. గుల్మోహర్ పార్కులో గత తొమ్మిదేళ్లుగా ప్రతిరోజూ ఉదయం ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్న యోగా గురువులు నూనె సురేందర్ జీ, గారెల వెంకటేష్ జీ సేవలను బేరి రామచందర్ యాదవ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యేగా పోటీ చేసిన నాయకులు, తాజా మాజీ కార్పొరేటర్, బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్‌తో పాటు యోగా శిక్షకులు, నేతాజీ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళా సోదరీమణులు, యువజన నాయకులు, చిన్నారులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఫిలిప్పీన్స్‌లో ఏడీఎంఎం--ప్లస్ సమావేశాలకు రాజ్‌నాథ్ సింగ్

**ఈ నెల 28, 29 తేదీల్లో సెబూలో సదస్సు.. ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతపై చర్చలు**

**న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 26:**
ఫిలిప్పీన్స్‌లోని సెబూ నగరంలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న 13వ ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం--ప్లస్ (ఏడీఎంఎం--ప్లస్)లో భారత ప్రతినిధి బృందానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వం వహించనున్నారు. 'ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా అంశాలపై అభిప్రాయాల మార్పిడి' అంశంపై ఆయన ప్రసంగించనున్నారు.
సదస్సు సందర్భంగా పాల్గొనే దేశాల రక్షణ మంత్రులతో రాజ్‌నాథ్ సింగ్ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. ఆయా దేశాలతో కొనసాగుతున్న రక్షణ సంబంధాలను సమీక్షించడంతోపాటు వ్యూహాత్మక భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేసే అవకాశాలపై చర్చించనున్నారు.
ఆసియాన్‌లో రక్షణ రంగ సంప్రదింపులు, సహకారానికి ఏడీఎంఎం అత్యున్నత వేదికగా ఉంది. ఆసియాన్ సభ్యదేశాలతోపాటు భారత్, అమెరికా, చైనా, రష్యా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల మధ్య భద్రత, రక్షణ సహకారాన్ని పెంపొందించేందుకు ఏడీఎంఎం--ప్లస్ పనిచేస్తోంది.
భారత్ 1992లో ఆసియాన్ చర్చల భాగస్వామిగా చేరింది. తొలి ఏడీఎంఎం--ప్లస్ సమావేశం 2010 అక్టోబర్ 12న వియత్నాంలోని హనోయ్‌లో జరిగింది. 2017 నుంచి సభ్యదేశాల రక్షణ మంత్రులు ఏటా సమావేశమై రక్షణ సహకారాన్ని బలోపేతం చేసేందుకు చర్చిస్తున్నారు.

2026 సంవత్సరానికి ఫిలిప్పీన్స్ ఏడీఎంఎం--ప్లస్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తోంది. ఈ వేదిక పరిధిలో 2024--2027 కాలానికి ఉగ్రవాద నిరోధక నిపుణుల కార్యబృందానికి మలేసియాతో కలిసి భారత్ సహాధ్యక్షత వహిస్తోంది. 'యాక్ట్ ఈస్ట్' విధానంలో భాగంగా ఆగ్నేయాసియా దేశాలతో రక్షణ సంబంధాలను విస్తరిస్తూ, ప్రాంతీయ శాంతి, సుస్థిరత, సమష్టి అభివృద్ధికి భారత్ ప్రాధాన్యమిస్తోంది.

# ఎగుమతిదారులకు ఊరట.. 'రిలీఫ్' గడువు పొడిగింపు

**2027 మార్చి 31 వరకు రెండో విభాగం అమలు.. అర్హతగల ఎగుమతులకు 95 శాతం రిస్క్ కవరేజీ**

**న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 26:**
పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, గల్ఫ్ పరిసర ప్రాంతాల్లో సముద్ర రవాణాకు ఎదురవుతున్న అంతరాయాల నేపథ్యంలో ఎగుమతిదారులకు కేంద్ర వాణిజ్య శాఖ ఊరట కల్పించింది. ఎగుమతి ప్రోత్సాహక మిషన్ పరిధిలోని 'రిలీఫ్' కార్యక్రమం రెండో విభాగం గడువును 2027 మార్చి 31 వరకు పొడిగించింది. ఈ మేరకు సెప్టెంబర్ 30న నోటిఫికేషన్ నంబర్ 37/2026--27 జారీ చేసింది.
నిర్దేశిత ప్రాంతాలకు చేపట్టే రాబోయే ఎగుమతులకు ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీజీసీ) బీమా రక్షణ పొందేలా ప్రోత్సహించడం ఈ విభాగం లక్ష్యం. ఇందులో 95 శాతం రిస్క్ కవరేజీ కల్పిస్తారు. 2026 మార్చి 16న లేదా ఆ తర్వాత తీసుకున్న స్టాండలోన్, హోల్ టర్నోవర్ పాలసీలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. అర్హత కాలంలో ఎగుమతిదారులు చెల్లించాల్సిన ప్రీమియం, అంతరాయాలకు ముందు ఉన్న స్థాయిని మించి పెరగకుండా రక్షణ కల్పిస్తారు.
పూర్తి కంటెయినర్ లోడ్ (ఎఫ్‌సీఎల్), పాక్షిక కంటెయినర్ లోడ్ (ఎల్‌సీఎల్), శీతలీకరణ సదుపాయం ఉన్న రీఫర్ కంటెయినర్లలో రవాణా చేసే సరుకులకు ఈ పథకం వర్తిస్తుంది. ఇంధన రవాణాకు మాత్రం వర్తించదు.
ప్రయోజనం పొందాలనుకునే ఎగుమతిదారులు ఈసీజీసీ వెబ్‌సైట్‌లోని కస్టమర్ పోర్టల్ ద్వారా క్లెయిమ్‌లు, సంబంధిత పత్రాలను సమర్పించాలి. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ పొందడం, ఎగుమతిదారుల నమోదు, క్లెయిమ్‌ల సమర్పణపై ఈసీజీసీ అధికారిక యూట్యూబ్ చానల్ 'ఏవఎ్ట్రషశ్రీఃం7016'లో వీడియో మార్గదర్శకాలు అందుబాటులో ఉన్నాయి.
గల్ఫ్, విస్తృత పశ్చిమాసియా సముద్ర మార్గాల్లో అంతరాయాలతో పెరిగిన సరుకు రవాణా వ్యయాలు, బీమా ప్రీమియంలు, యుద్ధ సంబంధిత ఎగుమతి నష్టభయాలను ఎదుర్కొనేందుకు 2026 మార్చి 19న 'రిలీఫ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాజా పొడిగింపు ద్వారా వాణిజ్య ప్రవాహాలు కొనసాగేందుకు, అనిశ్చిత పరిస్థితుల్లో భారత ఎగుమతిదారులకు మద్దతు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# అక్టోబర్ 27 నుంచి రైల్వే టికెట్ కౌంటర్లలోనూ ప్రయాణ బీమా.

**0.45 పైసలకే ఐచ్ఛిక బీమా.. గరిష్ఠంగా రూ.10 లక్షల పరిహారం.**




**తిరుపతి, త్రినెట్ న్యూస్, అక్టోబర్ 26:**
భారతీయ రైల్వేలు అక్టోబర్ 27 నుంచి రిజర్వేషన్ కౌంటర్లలో టికెట్లు కొనుగోలు చేసే ప్రయాణికులకు కూడా ఐచ్ఛిక ప్రయాణ బీమా సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నాయి. ఇప్పటివరకు ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌కే పరిమితమైన ఈ సదుపాయం ఇకపై కౌంటర్లలోనూ లభించనుంది.
బీమా పొందాలనుకునే ప్రయాణికులు తమ మొబైల్ నంబర్‌ను అందించి, టికెట్ ఛార్జీతో పాటు ప్రీమియంను డిజిటల్‌గా చెల్లించాలి. పన్నులతో కలిపి ఒక్కో ప్రయాణికుడికి ప్రీమియం 45 పైసలు. బీమా పూర్తిగా ఐచ్ఛికం. ఈ బీమా కింద రైలు ప్రయాణంలో మరణం లేదా శాశ్వత పూర్తి వైకల్యానికి రూ.10 లక్షల వరకు, పాక్షిక శాశ్వత వైకల్యానికి రూ.7.5 లక్షల వరకు, గాయాల చికిత్సకు రూ.2 లక్షల వరకు పరిహారం లభిస్తుంది. మృతదేహం తరలింపునకు రూ.10,000 వరకు చెల్లిస్తారు.
ఈ సదుపాయం అమలును రైల్వే ఉన్నతాధికారులు పర్యవేక్షించనుండగా, సీఆర్ఐఎస్ , ఐఆర్‌సీటీసీ సాంకేతిక సహకారం అందించనున్నాయి.

# యాదవ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

**•మేకల రాములు యాదవ్‌కు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి**

**•ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసిన మేకల వెంకటేష్ యాదవ్**

తెలంగాణ రాష్ట్రంలో యాదవ సామాజిక వర్గానికి సముచిత రాజకీయ గుర్తింపు ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఆ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల వెంకటేష్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజాసేవలో కీలక పాత్ర పోషిస్తున్న యాదవ సామాజిక వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తెలంగాణలో యాదవులు కురుమలు ఎర్రగొల్లలు తదితర గొల్ల సామాజిక వర్గాలకు చెందిన ప్రజలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని వెంకటేష్ యాదవ్ పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వం యాదవ సామాజిక వర్గ ఆకాంక్షలను గుర్తించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

### 20 ఏళ్లుగా యాదవ హక్కుల కోసం పోరాటం

తెలంగాణ జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ గత 20 సంవత్సరాలుగా యాదవ సామాజిక వర్గ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్నారని మేకల వెంకటేష్ యాదవ్ తెలిపారు. యాదవుల సమస్యలను ప్రభుత్వాల





దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సామాజిక న్యాయం రాజకీయ ప్రాతినిధ్యం సామాజిక వర్గ అభ్యున్నతి కోసం రాములు యాదవ్ నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యతనిస్తూ ప్రజాసేవను లక్ష్యంగా ముందుకు సాగుతున్న నాయకుడు మేకల రాములు యాదవ్ అని కొనియాడారు. యాదవ సామాజిక వర్గ సమస్యల పరిష్కారం హక్కుల పరిరక్షణ కోసం రెండు దశాబ్దాలుగా ఆయన చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి తగిన రాజకీయ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### యాదవులకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

రాష్ట్రంలో యాదవ సామాజిక వర్గానికి తగిన రాజకీయ అవకాశాలు కల్పించడం ద్వారా ఆ వర్గ ప్రజల ఆకాంక్షలకు గౌరవం ఇచ్చినట్లవుతుందని వెంకటేష్ యాదవ్ అభిప్రాయపడ్డారు. దీర్ఘకాలంగా సామాజిక వర్గ హక్కుల కోసం పోరాడుతున్న మేకల రాములు యాదవ్‌కు ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం సముచిత నిర్ణయమని పేర్కొన్నారు.

ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకులకు రాజకీయ అవకాశాలు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యంలో అన్ని సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని తెలిపారు. యాదవ సామాజిక వర్గ ఐక్యత హక్కుల సాధన అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న నాయకుల సేవలను గుర్తించడం ప్రభుత్వ బాధ్యతగా భావించాలని కోరారు.

### ముఖ్యమంత్రి సానుకూల నిర్ణయం తీసుకోవాలి

యాదవ సామాజిక వర్గ ఐక్యతను హక్కుల సాధన కోసం సాగుతున్న పోరాటాన్ని గుర్తించి మేకల రాములు యాదవ్‌కు ఎమ్మెల్సీ అవకాశం కల్పించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించాలని మేకల వెంకటేష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. యాదవ సామాజిక వర్గానికి సముచిత రాజకీయ గౌరవం కల్పించడంతో పాటు ప్రజాసేవకు అంకితమైన నాయకుల సేవలను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. మేకల రాములు యాదవ్‌కు ఎమ్మెల్సీ అవకాశం కల్పిస్తే యాదవ సామాజిక వర్గానికి రాజకీయంగా తగిన గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# భూ రీ సర్వే పనుల నిర్వహణ కొరకు రోవర్ల కొనుగోలు,

**• మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు,**

భూ రీ సర్వే పనుల నిర్వహణ కోసం అవసరమైన జిఎన్ఎస్ఎస్ రోవర్ పరికరాల కొనుగోలుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి. రాములు, మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో అవసరమైన రోవర్ల కొనుగోలు కొరకు ఈ.ఓ.ఐ. ప్రక్రియ ద్వారా ఆసక్తిగల సంస్థల వివరాలు పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. భూ రీ సర్వే పనులకు అవసరమైన సాంకేతిక ప్రమాణాలు, పరికరాల పనితీరు తదితర అంశాలకు పరిగణలోకి తీసుకోవడం



జరుగుతుందని తెలిపారు. భూ రీ సర్వే పనులను మరింత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించేందుకు ఆధునిక సర్వే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు.

అనంతరం పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో సి ఎం ఆర్ డెలివరీ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైస్ మిల్లులకు సంబంధించిన సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యం పంపిణీలో మిగిలి ఉన్న డెలివరీలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయి మొత్తాల రికవరీ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ బకాయిలను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. సిఎంఆర్ లక్ష్యాల సాధనలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# భూములిచ్చిన నిరుపేద రైతులకు అన్యాయమేనా....?

**- యంగ్ ఇండియా స్కూల్ కోసం భూములు ఇచ్చిన రైతుల ఆవేదన తీర్చేదెవరు...?**

**- ప్రభుత్వం,అధికారులు స్పందించాలి అంటున్న భూ బాధితులు....?**

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తోగ్గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గోపాలరావుపేటలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం భూములు కోల్పోయిన నిరుపేద కుటుంబాలు తమకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సుమారు 30 కుటుంబాలకు చెందిన 20 ఎకరాల భూమిని పాఠశాల నిర్మాణం కోసం తీసుకున్నారని, అయినప్పటికీ తమకు ప్రత్యామ్నాయ ఉపాధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా తగిన భరోసా లభించలేదని బాధితులు వాపోతున్నట్లు సమాచారం. గ్రామసభలకు పిలిచి అన్ని




విధాలా ఆదుకుంటామని, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు బాధితులు చెబుతున్నారు. అయితే తమకు పూర్తి వివరాలు తెలియకుండానే అంగీకార పత్రాలపై సంతకాలు తీసుకున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**- భూములు కోల్పోయి... జీవనోపాధికి దూరం...?**

వ్యవసాయ భూములే జీవనాధారంగా ఉన్న కుటుంబాలు భూములు కోల్పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొంటున్నాయి. భూముల సేకరణకు సంబంధించిన పరిహారం, పునరావాసం, ప్రత్యామ్నాయ ఉపాధి హామీల అమలుపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతున్నాయి.

విద్యాసంస్థ నిర్మాణం ఎంత ముఖ్యమో, దాని కోసం భూములు కోల్పోయిన పేద కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించడం కూడా అంతే ముఖ్యమని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత మండల, జిల్లా అధికారులు ఈ వ్యవహారంపై విచారణ జరిపి, రికార్డులను పరిశీలించి, అర్హులైన బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మాచర్లలో ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్

**మాచర్ల ఎమ్మార్వో బి. కిరణ్ కుమార్**

కృష్ణా–గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి డి నోవో ఓటర్ల జాబితా తయారీలో భాగంగా, కొత్త ఓటర్ల నమోదు కోసం మాచర్ల పట్టణంలో ఈరోజు ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కృష్ణా–గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఈ ఆర్ ఓ మరియు డి.ఆర్.ఓ గుంటూరు మరియు జిల్లా రెవెన్యూ అధికారి, పల్నాడు వారు జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా మాచర్ల పట్టణంలోని చైతన్య స్కూల్, నారాయణ స్కూల్ లలో, అలాగే మాచర్ల రూరల్ పరిధిలో తహసీల్దార్, మాచర్ల వారు మరియు మండల విద్యాశాఖాధికారి, మాచర్ల వారి ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అర్హులైన ఉపాధ్యాయులు తమ ఓటును నమోదు చేసుకునే విధానం, కావాల్సిన పత్రాలు, గడువు తేదీలపై అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు.





# పెద్దగొన్నూరు లో ఎంపీపీ అభ్యర్థి కోటప్రోలు నాగరత్న కుమారి ప్రచారానికి విశేష స్పందన

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండలం అక్టోబర్ 26:ముదినేపల్లి మండల ఎంపీపీ అభ్యర్థిగా పెద్దగొన్నూరు ఎంపీటీసీ సెగ్మెంట్ నుంచి పోటీ చేస్తున్న దివంగత నేత కోటప్రోలు పూర్ణ సతీమణి శ్రీమతి కోటప్రోలు నాగరత్న కుమారి ఎన్నికల ప్రచారం సెగ్మెంట్ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. కైకలూరు శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆశీస్సులతో, కే.ఎల్ నారాయణ మద్దతుతో పాటు ముదినేపల్లి మండల ఎన్డీఏ నాయకుల సహకారంతో ప్రచార కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. నాయకులు, కార్యకర్తల సమన్వయం మరియు ప్రజల ఆదరణతో ప్రచార కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రచార కార్యక్రమంలో గుడివాడ వేణు, మాజీ సర్పంచ్ శివప్రసాద్, గంగయ్య, పరసా ఏడుకొండలు, రాజేష్, యేసు,చక్రపాణి,సుబ్బయ్య, ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక శ్రేయోభిలాషులు పాల్గొని అభ్యర్థికి తమ మద్దతు తెలియజేశారు. గ్రామ ప్రజలను కలుసుకుంటూ వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ ప్రచారం కొనసాగింది.





# నిధుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి: సర్పంచ్ కలం కల్పన.



రామానుజవరం గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగం జరిగిందంటూ చేస్తున్న ఆరోపణలపై, శ్రీ సమ్మక్క సారలమ్మ గిరిజన ఇసుక సొసైటీపై వస్తున్న ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరపాలని సర్పంచ్ కలం కల్పన, సొసైటీ సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ నిధుల వినియోగం నిబంధనల ప్రకారమే జరుగుతోందని, సమావేశాల్లో తీర్మానాలు చేసిన అనంతరం బిల్లుల ప్రక్రియ కొనసాగుతుందని సర్పంచ్ కల్పన తెలిపారు. నిధుల వినియోగంపై అనుమానాలుంటే ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేయాలని, వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అలాగే, గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్న శ్రీ సమ్మక్క సారలమ్మ గిరిజన ఇసుక సొసైటీ సభ్యుల పేర్లతో, వారి ప్రమేయం లేకుండా ఫిర్యాదులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని, ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు పేర్కొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు అండగా డ్వాక్రా మహిళలు.

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని గోపాలరావుపేట గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు చాటి చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, తోగ్గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని



గోపాలరావుపేట గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేద కుటుంబాలను గుర్తించిన మహిళా సంఘాల సభ్యులు వారికి చేయూతనివ్వాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా సంఘాల సభ్యులు తమ సొంత విరాళాలను సమకూర్చుకుని నిత్యావసర సరుకుల కిట్లను సిద్ధం చేసి పేద కుటుంబాలకు అందజేశారు. కందిపప్పు, వంట నూనె, ఉప్పు, కారం, చక్కెర తదితర నిత్యావసర వస్తువులను పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ, పేద కుటుంబాలకు చిన్నపాటి సహాయం అందించినా వారి కష్టాల్లో కొంత ఉపశమనం కలిగించినట్లవుతుందని తెలిపారు. మహిళలు పొదుపు, ఆర్థిక స్వావలంబనకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలరావుపేట గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం విక్రయించండి : ఏవో వెంకటేశ్వర్లు.

**- క్వింటాకు రూ.500 బోనస్.. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.**

వానాకాలం 2026లో వరి సాగు చేసిన రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు



తక్కువ ధరలకు విక్రయించి నష్టపోవద్దని పినపాక మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. రైతులు ధాన్యం పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతే కోతలు చేపట్టి, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని సిద్ధం చేసుకోవాలని కోరారు. ధాన్యంలో తేమశాతం 17 శాతానికి మించకుండా బాగా ఆరబెట్టి, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న ధాన్యం రకాలకు క్వింటాకు రూ. 2,461 మద్దతు ధరతో పాటు అదనంగా రూ. 500 బోనస్ అందించనున్నట్లు తెలిపారు. అలాగే దొడ్డు ధాన్యానికి క్వింటాకు రూ. 2,441 మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర, బోనస్ ప్రయోజనాలను రైతులు పూర్తిస్థాయిలో పొందాలని సూచించారు. ఎవరైనా వ్యాపారులు లేదా దళారులు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే పినపాక తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి లేదా జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. రైతులు దళారుల చేతిలో నష్టపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకొని తమ పంటకు గిట్టుబాటు ధర పొందాలని మండల వ్యవసాయ అధికారి రైతులను కోరారు.

# సీతమ్మ పాత్ర అని చెప్పగానే.. ఏమీ ఆలోచించలేదు: సాయి పల్లవి



'రామాయణ'లో సీతమ్మ పాత్రలో నటించడం తనకెంతో ప్రత్యేకమైన అనుభవమని హీరోయిన్ సాయిపల్లవి చెప్పారు. సినిమా ప్రచారంలో భాగంగా రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి 'కౌన్ బనేగా కరోడ్‌పతి 18' కార్యక్రమానికి అతిథులుగా హాజరయ్యారు. ఈ సినిమాలో అవకాశం రావడం ఎలా అనిపించిందనే ప్రశ్నకు సమాధానమిచ్చారు.సాయిపల్లవి మాట్లాడుతూ.. సాధారణంగా తాను ఏ సినిమాలో నటించినా.. ఆ పాత్రకు తనవంతుగా ఏం చేయగలనని ఆలోచిస్తానని చెప్పారు. అయితే సీతమ్మ పాత్ర విషయంలో మాత్రం అలా చేయలేదన్నారు. "నేను ఈ పాత్ర గురించి ఎక్కువగా ఆలోచించాలనుకోలేదు. సీతమ్మగా నటించడం వల్ల నేను ఎంత జ్ఞానాన్ని సొంతం చేసుకోగలననే విషయాన్ని మాత్రమే చూశా. నాకు తెలిసిన కొన్ని అంశాలను కూడా పక్కనపెట్టా. 'అమ్మా.. నాతో ఈ పాత్ర నువ్వే చేయించుకో' అని సీతమ్మను ప్రార్థించి సెట్స్‌లోకి అడుగుపెట్టా" అని వివరించారు. ఆమె మాటలను విన్న అమితాబ్ బచ్చన్.. చాలా బాగా చెప్పారంటూ ప్రశంసించారు.దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కించిన 'రామాయణ' చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా కనిపించనున్నారు. హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్ నటిస్తున్నారు. ఈ ఇతిహాసాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తొలి భాగం 2026 నవంబరు 5న విడుదల కానుంది.

## విడుదల వాయిదా వల్ల 'ఆదర్శ కుటుంబం' అందంగా మారింది: శ్రీనిధి శెట్టి

'ఆదర్శ కుటుంబం'లో కామెడీ ఎంత ఎంజాయ్ చేస్తారో, యాక్షన్ కూడా అదే స్థాయిలో అలరిస్తుందని అంటున్నారు కథానాయిక శ్రీనిధిశెట్టి. వెంకటేశ్‌తో కలిసి ఆమె నటించిన ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు త్రివిక్రమ్ దర్శకత్వం వహించారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మించారు. అక్టోబరు 30న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శ్రీనిధి పంచుకున్న ఆసక్తికర విషయాలు..

**ఇలాంటి పాత్రలు అరుదగా వస్తాయి..**

"త్రివిక్రమ్ దర్శకత్వంలో సినిమా చేయాలనే కోరిక ముందు నుంచి ఉంది. అలాంటిది ఆయన నుంచి పిలుపు రావడం సంతోషంగా అనిపించింది. ఆయన సినిమాలకు పూర్తి



## మా వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దు: రష్మిక

విజయ్ దేవరకొండతో వివాహ బంధంపై సామాజిక మాధ్యమాల వేదికగా వస్తున్న వార్తలను నటి, విజయ్ సతీమణి రష్మిక ఖండించారు. తమ వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దని హెచ్చరించారు. జరిగింది ఏంటో పూర్తిగా తెలుసుకోకుండా అరకొర సమాచారంతో ఓ నిర్ణయానికి రావొద్దని హితవు పలికారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

ఇటీవల ప్రసారమైన 'కాఫీ విత్ కరణ్' షోలో ఈ జోడీ పాల్గొని అనేక విషయాలను ముచ్చటించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. 'రష్మిక పెళ్లి చేసుకోమని నన్ను 100 సార్లు అడిగింది' అని అన్నారు. దీనిపై విజయ్‌ను విమర్శిస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు మొదలయ్యాయి. ఈ క్రమంలో రష్మిక స్పందిస్తూ పెళ్లి ప్రతిపాదన తెచ్చినప్పుడు విజయ్ సమయం తీసుకోవడం తప్పేం లేదని అన్నారు. అతనిపై తనకు పిచ్చి ప్రేమ ఉందని తెలిపారు. తాము ఒకరినొకరం ఎంచుకున్నామని వివరించారు.

"ప్రియమైన ఇంటర్నెట్ ప్రజలారా..! సాధారణంగా ఇలాంటి విషయాలకు స్పందించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాన్ని తెలిపే హక్కు ఉంటుంది. మేము ఇచ్చిన ఇంటర్వ్యూకు వస్తున్న స్పందన చూస్తుంటే, మేం ఏం చెప్పామో అర్థం చేసుకోవడం కంటే, ఎవరినో ఒకరిని తప్పుబట్టడంపైనే ఎక్కువమంది



ఆసక్తి చూపిస్తున్నట్లు అనిపించింది. ఆ షోలో మా మధ్య జరిగిన సంభాషణ 'మేము ఎవరికి ఎన్నిసార్లు ప్రపోజ్ చేసుకున్నాం? పెళ్లి చేసుకోవడానికి అంత సమయం ఎందుకు పట్టింది?' అన్న విషయాలు గురించి కాదు. నేను పెళ్లి ప్రతిపాదన తెచ్చినప్పుడు విజయ్ సమయం తీసుకోవడంలో తప్పేమీ లేదు. ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోవడానికి, జీవితంలోని ఒడుదొడుకులను కలిసి ఎదుర్కోవడానికి మేము సిద్ధంగా ఉన్నామో లేదో తెలుసుకోవడానికి తగినంత సమయం తీసుకోవడం ఎప్పుడూ ముఖ్యమే""తన జీవితంలో ఏం కావాలో విజయ్‌కు బాగా తెలుసు. ఒక పెద్ద నిర్ణయం తీసుకునే ముందు ఎవరైనా సరే ఆలోచిస్తారు. విజయ్ తన మనసు చెప్పినట్లు నడుచుకుంటాడు. జీవితాన్ని చూసే మా భిన్నమైన దృక్పథాలే మా బంధాన్ని మరింత బలంగా ఉంచుతాయి. పెళ్లి అనేది ఎప్పుడూ ఒక గొప్ప ప్రతిపాదన. ఏదో ఉంగరాలు మార్చుకోవటం, వేడుకలు చేసుకోవడం వంటి విషయాలకు సంబంధించింది కాదు. ఇద్దరూ కలిసి జీవితాన్ని నిర్మించుకోవడం ముఖ్యం. అందుకే మేము మా ఇద్దరినీ ఎంచుకున్నాం. అవును..! విజయ్ అంటే నాకు పిచ్చి ప్రేమ. అందులో తప్పేముంది?ఇదేమీ చెడ్డ విషయం కాదు కదా! నేను పెళ్లి చేసుకోబోతున్న వ్యక్తిని ప్రేమించకపోతే, అసలు అతడిని ఎందుకు పెళ్లి చేసుకుంటాను""ఒకప్పుడు నాతో స్నేహంగా, ప్రేమగా ఉన్న వారు నేను కష్టాల్లో ఉన్నప్పుడు నా పక్కన లేరు. ఆ సమయంలో విజయ్ నాకు అండగా నిలిచాడు. ఇప్పటికీ ఆ మద్దతు కొనసాగుతూనే ఉంది. నా జీవితానికి సంబంధించిన విషయాల్లో నేను చెబుతున్న మాటల కంటే, ఇంటర్నెట్‌లో ప్రచారమయ్యే ఊహాగానాలు, ఎడిట్ చేసిన వీడియోలు, నిరాధారమైన వార్తలు ఎక్కువ నమ్ముతున్నారు. ఇలాంటి వాటిని కొందరు ఇష్టపడటం నిజంగా భయంగా అనిపిస్తోంది. నేను బాధలో ఉన్నప్పుడు, నాకు సలహా అవసరమైనప్పుడు, భద్రత కావాలనుకున్నప్పుడు, ఓదార్పు, మద్దతు అవసరమైనప్పుడు మీరెవరూ నా పక్కన లేరు.. ఉండరు.. కానీ, అతను (విజయ్) ఉంటాడు""ప్రస్తుతం నా జీవితంలో ఎన్నడూ లేనంత సంతోషంగా ఉన్నా. పెళ్లి తర్వాత నేను అనుభవిస్తున్న సంతోషాన్ని నా ముఖంలో చూడండి. అలాగే నా నటనలో, నా సినిమాల్లో చూడగలరని ఆశిస్తున్నాను. నేను ఎంతో అదృష్టవంతురాలిని. నా కుటుంబం గురించి పూర్తిగా తెలియకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఫెమినిజం ముసుగులో జరుగుతున్న వేధింపు మాత్రమే. పదేళ్లుగా నాపై ప్రేమను కురిపిస్తూ, ఆదరిస్తున్నందుకు కన్నడ స్నేహితులు, అభిమానులకు కృతజ్ఞతలు" అని రష్మిక పేర్కొన్నారు.ఈ అంశంపై విజయ్ దేవరకొండ కూడా స్పందించారు. తాము సంతోషంగా ఉన్నామని, రష్మిక తన భార్య అని, ఆమెతో జీవితం పంచుకోవడం ఆశీర్వాదమన్నారు. 'ఒకవేళ నేను, ఆమె ఈప్రపంచానికి వ్యతిరేకంగా ఉన్నామనిపిస్తే అలాగే కానివ్వండి. ప్రేమను ఓ వేడుకగా జరుపుకొనేవారు, సాధారణ

## చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఐదు రోజులు గడిపితే జీవితమేంటో తెలుస్తుంది..



ప్రముఖ బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్‌పాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన గతం, చిన్ననాటి కష్టాల గురించి పదే పదే మాట్లాడటంతో విసుగొచ్చిందని, ఆఖరికి తన బాల్యాన్ని తానే అసహ్యించుకుంటున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ముంబయిలో జరిగిన 'ఇండియన్ ఫిల్మ్ ప్రాజెక్ట్ ఫెస్టివల్'లో పాల్గొన్న మనోజ్.. తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.సినిమాల ప్రమోషన్ల కోసం ఇప్పుడు చాలామంది పాడ్‌కాస్ట్‌లను ఎంచుకుంటున్నారు. అయితే తాను ఇకపై వాటిలో పాల్గొననని మనోజ్ స్పష్టం చేశారు. "నా చిన్ననాటి విషయాలు చెప్పి చెప్పి విసిగిపోయాను. ఒకానొక దశలో నా బాల్యాన్ని నేనే అసహ్యించుకోవడం మొదలుపెట్టాను. నేనెందుకు పల్లెటూరిలో పుట్టాను? అనిపిస్తుంది. నా ప్రయాణాన్ని అందరూ స్ఫూర్తిదాయకం అంటున్నారు. కానీ అది నరకంతో సమానం. నేనేమీ ఎవరికీ జ్ఞానబోధ చేయట్లేదు. నేను కూడా దిల్లీలో పుట్టి ఉంటే బాగుండేది. అప్పుడు ముంబయికి చేరుకోవడం కాస్త సులువయ్యేది. కానీ, ఊర్లో పుట్టడం వల్ల ఎన్నో బస్సులు మారుతూ ముంబయికి చేరుకోవాల్సి వచ్చేది. చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఐదు రోజులు గడిపితే జీవితమేంటో తెలుస్తుంది" అని మనోజ్ తన గతాన్ని గుర్తుచేసుకున్నారు.

మనోజ్ బాజ్‌పాయ్ ప్రధాన పాత్రలో, రితేష్ షా తెరకెక్కించిన చిత్రం 'గజబ్ రాత్' . ఇటీవల విడుదలైన ఈ సినిమా వివాదంపై కూడా ఆయన ఘాటుగా స్పందించారు. ఈ చిత్రానికి మొదట 'ఘూస్ ఖోర్ పండత్' అని పేరు పెట్టారు. అయితే దీనిపై అభ్యంతరాలు రావడం, ట్రోలర్లు ఏకంగా మనోజ్ కుటుంబ సభ్యుల ఫొటోలు పెట్టి అసభ్యకరంగా కామెంట్లు చేయడంపై ఆయన మండిపడ్డారు. "నేను నటుడిని కాబట్టి నన్ను ఎంతైనా విమర్శించండి. దాన్ని భరించే ధైర్యం నాకుంది. కానీ నా వాళ్లను లక్ష్యంగా చేసుకుంటే మాత్రం సహించను. నా కుటుంబాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి వస్తే నేను ఎవరితోనైనా పోరాడుతాను" అని హెచ్చరించారు. వివాదం ముదరడంతో మేకర్స్ ఈ సినిమా పేరును 'గజబ్ రాత్'గా మార్చారు. ఈ చిత్రంలో నుస్రత్ భరుచ్చా, సాకిబ్ సలీమ్, అక్షయ్ ఒబెరాయ్, దివ్య దత్తా, కీకు శారదా, శ్రద్ధా దాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రం ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

## 12 ఏళ్ల తర్వాత తమిళ సినిమా.. చాలా సంతోషంగా ఉంది: నజ్రియా నజీమ్



మలయాళ నటి నజ్రియా నజీమ్ 12 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తమిళ చిత్ర పరిశ్రమలోకి రీఎంట్రీ ఇస్తున్నారు. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న 'సీన్' సినిమాతో ఆమె మళ్లీ తమిళ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. మలయాళ హిట్ డైరెక్టర్ జీతూ మాధవన్ ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కిస్తున్నారు. తాజాగా దుబాయ్‌లోని ఓ మాల్‌లో జరిగిన ఈ సినిమా ప్రమోషనల్ ఈవెంట్‌లో నజ్రియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "12 ఏళ్ల తర్వాత నేను మళ్లీ తమిళ సినిమాలో నటిస్తున్నాను. నాపై నమ్మకం ఉంచి ఇంత మంచి పాత్ర ఇచ్చినందుకు జీతూ మాధవన్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు. నా కెరీర్‌లోనే ఇదొక అద్భుతమైన ప్రయాణం" అని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేదికపై సూర్యపై నజ్రియా ప్రశంసలు కురిపించారు. "మేము చిన్నప్పటినుంచి సూర్య సర్ సినిమాలు చూస్తూ పెరిగాం. సినిమాలను ఇంత సీరియస్‌గా తీసుకుని, మంచి కథలను ఎంచుకోవడానికి ఆయనే మాకు స్ఫూర్తి. సెట్‌లో ఆయనతో కలిసి పనిచేయడం చాలా సరదాగా సాగింది. సూర్య ఎంతో అద్భుతమైన వ్యక్తి" అని ఆమె కొనియాడారు. ఇక, సూర్య, జీతూ మాధవన్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంలో యువ నటుడు నస్లెన్ కీలక పాత్ర పోషిస్తుండగా.. సుషిన్ శ్యామ్ సంగీతం అందిస్తున్నారు. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై జ్యోతిక, సూర్య స్వయంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దీపావళి కానుకగా నవంబర్ 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు

## డిసెంబరులో పాకెట్ నావెల్

విభిన్నమైన కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తున్నారు కథానాయిక మాళవిక మోహనన్. ఇప్పటికే ఈ ఏడాది 'రాజాసాబ్', 'సర్దార్ 2' లాంటి చిత్రాలతో తెరపై మెరిసిన ఈమె.. ఇప్పుడు ముచ్చటగా మూడో చిత్రంతో ఆకట్టుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. మాళవిక, విలక్షణ నటుడు విజయ్ సేతుపతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పాకెట్ నావెల్'. త్యాగరాజన్ కుమార రాజా దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణను పూర్తి చేసుకున్నట్లు చిత్రబృందం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దీన్ని డిసెంబరులో తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ సినిమాకి సంబంధించిన కథాంశంతో పాటు విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయని తమిళ చిత్ర వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రంలో రాజ్ బి.శెట్టి కీలక పాత్రలో కనిపించనున్నారు.



## అసిన్ కుమార్తెకు ఏడేళ్లకే 12 భాషలు!

ఒకప్పుడు దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ ఓ వెలుగు వెలిగారు అసిన్ . మైక్రోమ్యాక్స్ సహ వ్యవస్థాపకుడు రాహుల్ శర్మను వివాహం చేసుకున్న తరువాత సినిమాలకు దూరమయ్యారు. అప్పటి నుంచి ఆమె పూర్తిగా కుటుంబ జీవితానికే అంకితమయ్యారు. వారికి అరిన్ అనే ఏడేళ్ల కుమార్తె ఉంది. ఓ ఇంటర్వ్యూలో రాహుల్ శర్మ అసిన్‌తో పాటు తమ కుమార్తె గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "అసిన్‌ను వివాహం



చేసుకోవడమనేది నా జీవితంలో జరిగిన ఓ అద్భుత విషయం.నా కలలు, లక్ష్యాలను బాగా అర్థం చేసుకోవడంతో పాటు, నన్ను గట్టిగా విశ్వసిస్తుంది. ఆమె లాంటి వ్యక్తులు పక్కన ఉంటే, మన జీవితం చాలా సాఫీగా ఉంటుంది. జీవిత భాగస్వామి అంటే మనల్ని వెన్ను తట్టి ప్రోత్సహించాలి తప్ప, వెనక్కి లాగకూడదు. ఆమె నాకు అందిస్తున్న సహకారాన్ని మాటల్లో చెప్పలేను" అని

# ఆశ్వీజ మాసం గోదావరి నది హారతి చాలా విశేషమైనది

**•భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షులు రామవజ్జల రవికుమార్**

ఆశ్వీజ మాసం చాలా విశేషమైన రోజున భక్తుల కోలహాలం జై జై ధ్వనాలతో భద్రాచలం గోదావరి మాత నదిహారతి పురోహితుల మంత్రోచ్చారణలతో అంగరంగ వైభవంగా జరిగిందని పురోహితులు రామవజ్జల రవికుమార్ అన్నారు.

ఆదివారం నాడు శ్రీ సీతారామచంద్రస్వామి దివ్య క్షేత్రం భద్రాచలంలో గోదావరి కరకట్ట ప్రాంతంలోని ఆంజనేయస్వామి గుడి ఆవరణలో నిర్వహించిన నదీహారతి కార్యక్రమములో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న ప్రదేశంలోని గోదావరి తీరంలో ఆదివారం లోక కళ్యాణార్థం గోదావరి మాత, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి శుభాశీస్సులతో ఆశ్వీజ మాసం దేవి శరన్నవరాత్రులు పూర్తిచేసుకుని పూర్ణిమ ఘడియల సమయంలో గోదావరి మాతకు, శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి, పున్నమి రాత్రి సందర్భంగా చంద్ర భగవానునికి లోక కళ్యాణార్థం ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధిని కాంక్షిస్తూ చంద్ర భగవానుని హారతులు సమర్పించడం వలన ప్రజలకు ఆయురారోగ్య ఐశ్వర్య అభివృద్ధి





జరుగుతుందని, గోదావరి హారతి వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన భక్తులకు తెలిపిన అనంతరం భక్తి గీతాలతో భక్తుల జై శ్రీరామాయ నమః అని శ్రీరామ స్మరణతో గోదావరి నదికి గోదావరి హారతి నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, దేశ విదేశాల నుండి వచ్చే భక్తులు నదిహారతి కార్యక్రమంలో పాల్గొని పునీతులు అవుతున్నారని అన్నారు.

అనంతరం పురోహితులు గోదావరి హారతి విశేషాలను ముందుగా వినిపించి, గణపతి పూజ చేసి, పూజా ద్రవ్యాలతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేశారని, పురోహితులు

శ్రీరామ అష్టోత్తరం పటిస్తుండగా ఓం శ్రీ రామాయ నమః అంటూ108 సార్లు భక్తులచే శ్రీరామ నామ భజన అనంతరం ముందుగా సీతారామచంద్రస్వామి వారికి హారతి ఇచ్చిన ఆనంతరం గోదావరి నదికి హారతులు సమర్పించడం జరిగిందని, లోక కళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహాత్కార్యంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, రామాను గ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందాలని ఆయన అన్నారు

అనంతరం శాంతి మంత్ర పఠనం జరిపి, పి ఎస్ ఎన్ రెడ్డి, కావ్య దంపతులు ఆధ్వర్యంలో ప్రసాదం భక్తులకు పంపిణీ చేయడం జరిగిందని, నదిహారతి కార్యక్రమానికి పూజా సామాగ్రి భద్రాచలం పురోహిత సంఘం తరపున అందించారని ఆయన అన్నారు.

అంతకుముందు చిన్నారి కీర్తన చేసిన నృత్యాన్ని భక్తులు తిలకించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు రామా వజ్జలరవికుమార్ శర్మ, రామాచార్యులు, చంద్రశేఖర్ శర్మ, తేజ శర్మ, శివ, తిరుపతిరావు, పి ఎస్ ఎన్ రెడ్డి మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు నియోజకవర్గ తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం మహిళా విభాగం అధ్యక్షురాలిగా నారోజు గౌతమి

**•నల్గొండ జిల్లా బాధ్యతలు అప్పగిస్తూ నియామక ఉత్తర్వులు జారీ**

తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నారోజు గౌతమి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి రాష్ట్ర కో-ఆర్డినేటర్ పొగుల నాగార్జున రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. 2026 అక్టోబర్ 25వ తేదీన ఈ నియామక పత్రాన్ని అధికారికంగా అందజేశారు.

నల్గొండ జిల్లా పరిధిలోని మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా విభాగం అధ్యక్షురాలిగా గౌతమికి బాధ్యతలు అప్పగించారు.



నియోజకవర్గ పరిధిలోని వార్డు సభ్యులను సంఘటితం చేయడంతో పాటు సంస్థను మరింత బలోపేతం చేయడం వార్డు సభ్యుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం వారి హక్కులు మరియు సంక్షేమం కోసం కృషి చేయడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని నియామక పత్రంలో పేర్కొన్నారు.

తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు కృషి చేస్తారని తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం నాయకత్వం విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. మునుగోడు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన నారోజు గౌతమికి పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మహిళా వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి వారి హక్కుల పరిరక్షణకు ఆమె కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి.

**•శాఖల వారీగా బ్యాక్ లాక్ వేకెన్సీల నివేదికను వెంటనే సమర్పించాలి.**

**•జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్.**

సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు రెవెన్యూ కె అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్ఓ నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు,

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజావాణి కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి వేగంగా పరిష్కరించాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని విభాగాలకు సంబంధించి బ్యాక్లాగ్ వేకెన్సీ ల వివరాలను తక్షణమే నివేదికను అందించాలని, సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఎల్ ని నో కారణంగా జిల్లా వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత



అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, వసతి గృహాల నిర్వహణ, కార్యాలయ విధుల ముఖచిత్రం హాజరు, శాఖల పరిధిలో పెండింగ్లో ఉన్న అన్ని పనులను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు.

సోమవారం వివిధ మండలాల నుండి జిల్లా,డివిజన్, మండలాల వారీగా మొత్తం (134)దరఖాస్తులు వచ్చాయి,

నెల్లికుదురు మండలం మునిగలవీడు గ్రామానికి చెందిన ఇసంపెల్లి రమేష్ తాను ఒంటరిగా ఉంటూ పూరి గుడిసెలో నివసిస్తున్నానని తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని కోరారు.

సీరోలు మండలం మన్యగూడెం తాల్య తండకు చెందిన భీమా ఎన్నో ఏళ్లుగా తాము సాగుచేసుకుంటున్న భూమి వేరే ఇతర వ్యక్తులపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని విచారణ



చేసి మా యొక్క భూమిని మా పేరుపై రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వగలరని కోరారు.

తెలంగాణ రాష్ట్ర దళిత బందు సాధన సమితి దళితబందు బాధితులు తమ ఎకౌంట్లలో రెండో విడత దళితబందు డబ్బులు 2 లక్షల రూపాయలను జమచేయాలని కోరారు.

డోర్నకల్ మండలం గుర్రాల కుంట గ్రామానికి చెందిన ఇస్లావత్ మాన్ సింగ్ తమకు పూర్వీకుల నుండి సంక్రమించిన భూమిని అధికారులు వేరేవారికి పట్టా చేస్తారని చెపుతున్నారని పట్టాపాసు పుస్తకాల ప్రకారం తమకు ఉన్న భూమిని వేరే ఇతర వ్యక్తులకు పట్టా చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో న్యాయ సేవ సంస్థ ప్రతినిధి, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపర్డెంట్లు, పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ప్రభుత్వం అందించాలి

**- టాజీఖ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతం సురేందర్**

పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో దంతాలపల్లి మండల జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు అందించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతం సురేందర్ ఆధ్వర్యంలో తాసిల్దార్ సునీల్ కుమార్ రెడ్డి, మరియు ఎంపీడీవోకు వినతిపత్రాన్ని



అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టులకు ఇచ్చిన మాట ప్రకారం ఇండ్ల స్థలాలు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేయాలని ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలు జర్నలిజం లోనే జీవితాన్ని కొనసాగిస్తున్నారు, అలాంటి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని అన్నారు అక్రిడేషన్లు ఇచ్చి కాలం గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం బాధాకరమని ప్రభుత్వం స్పందించి వెంటనే ప్రతి జర్నలిస్టుకు తప్పనిసరిగా ఇండ్ల స్థలం ఇల్లు డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో తీయజేయు జిల్లా నాయకులు పంతం విజయేందర్, జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి మిడతపల్లి సురేందర్, తొర్రూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి జల్ల శ్రీనివాస్, డివిజన్ కోశాధికారి కాయితోజు శ్రీనివాస చారి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

సోమవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన



తరగతుల అభివృద్ధి అధికారి సాయిశ్రీజ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి ప్రపంచానికి పరమ పవిత్రమైన రామాయణాన్ని వరంగా అందించిన ఆదికవి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమములో వసతి గృహ సంక్షేమ అధికారులు, జిల్లా అధికారులు, xణాజ కార్యాలయ సిబ్బంది, మరియు జిల్లాలోని బోయ సంఘాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# గ్రామకంఠం కాదు.. పట్టా భూములే!

**మహేశ్వరం పేరేడు 1, 2 భూములు పట్టా భూములే!**

**గ్రామకంఠం కాదు.. ప్రభుత్వ భూమి కాదు.. దేవాలయ భూమి కూడా కాదు పట్టా భూమి**

**కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకి ఈశ్వర్ చేసిన ఆరోపణలు అవాస్తవం**

**సర్పంచ్ నవీన్, కర్రోళ్ల చంద్రయ్య**

**పేరేడు 1,2 లో ఉన్న భూమి 60 కోట్లు అనేది ఒక బోగస్!**

మహేశ్వరం పరిధిలోని పేరేడు 1, 2లో ఉన్న 4.06 గుంటల భూమి గ్రామకంఠం, ప్రభుత్వ భూమి కాదని, అది పట్టా భూమి అని గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య స్పష్టం చేశారు. ఈ భూమికి సంబంధించి 1950 నుంచి ఉన్న పత్రాలు, గతంలో జరిగిన ఒప్పందాలు, న్యాయస్థానంలో జరిగిన విచారణ వివరాలను వారు ప్రస్తావించారు. భూమిపై వాస్తవాలను నిర్ధారించేందుకు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించాలని కోరారు.

## 1950 నుంచి పట్టా భూమిగానే నమోదు!

గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ.. పేరేడు 1, 2లోని భూమి పట్టా భూమి అని, గ్రామకంఠం లేదా ప్రభుత్వ భూమి కాదని తెలిపారు. అప్పటి దేవాలయ కమిటీతో కుదిరిన ఒప్పందం ప్రకారమే భూమికి సంబంధించిన అమ్మకాలు, కొనుగోళ్లు జరిగాయని పేర్కొన్నారు. ఈ భూమిపై సర్వే నిర్వహించాలని కోరుతూ పది రోజుల క్రితమే మహేశ్వరం తహశీల్దార్కు వినతిపత్రం సమర్పించినట్లు వెల్లడించారు. ఇదే లేఅవుట్లో 2004లో తన భార్య పేరుతో ప్లాటు కొనుగోలు చేసినట్లు తెలిపారు.

## 1991లో లేఅవుట్.. 1998లో కోర్టు తీర్పు

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య మాట్లాడుతూ.. పేరేడు 1, 2లోని భూమి 1950 నుంచి పట్టా భూమిగానే పత్రాల్లో నమోదై ఉందని పేర్కొన్నారు. 1991లో -సయ్యద్ హస్నోద్దిన్ ఆధ్వర్యంలో లేఅవుట్ ఏర్పాటు చేసినట్లు, అదే ఏడాది గ్రామపంచాయతీ నుంచి ఎన్వోసీ వచ్చినట్లు తెలిపారు. 1992లో లేఅవుట్కు సంబంధించి కోర్టులో కేసు నమోదైందని, 1998లో ఇబ్రహీంపట్నం కోర్టులో తమ వాదనకు అనుకూలంగా తీర్పు వచ్చిందని చెప్పారు. దేవాలయ భూమి అని నిరూపించేందుకు సరైన ఆధారాలు లేవని కోర్టు ఆదేశాల్లో పేర్కొన్నట్లు వివరించారు. పేరేడు 1,2 కి సంబంధించి సయ్యద్ సాదత్, సల్మాన్ షేరిఫ్, అఫ్నన్ పట్టదారులుగా ఉన్నారు.

## దేవస్థానం కమిటీతో ఒప్పందం

2002లో శివగంగా రాజరాజేశ్వరి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో లేఅవుట్లో ప్లాట్ల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి ఒప్పందం జరిగినట్లు చంద్రయ్య తెలిపారు. అప్పటి సర్పంచ్ కూన యాదయ్య, దేవస్థానం కమిటీ



చైర్మన్ కాకి ఈశ్వర్ ఈ స్థలం గ్రామకంఠం, దేవాలయ భూమి కాదనే విషయంపై ఒప్పంద పత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. పేరేడు 1, 2 భూములకు సంబంధించి టెనెంట్దారులుగా దోమ ఎల్లారెడ్డి మరియు బజార్ (చాకలి) జంగయ్య పేరు ఉందని, 38-ఈ పత్రం కూడా ఆయన పేరుతో ఉందని తెలిపారు. 1996లో జంగయ్య తన టెనెన్సీ హక్కులను అసునుద్దిన్కు సరెండర్ చేసినట్లు వివరించారు.

## 72 మంది పట్టాదారులు ఉన్నారని వెల్లడి

ఈ లేఅవుట్లో ప్రస్తుతం 72 మంది పట్టాదారులు ఉన్నారని, తాను 2003లో ప్లాట్లు కొనుగోలు చేసినట్లు చంద్రయ్య తెలిపారు. అప్పటి మార్కెట్ విలువ ప్రకారమే ప్లాట్ల కొనుగోళ్లు జరిగాయని, తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేశారనే ఆరోపణలు అవాస్తవమని అన్నారు. 72 మంది ప్లాట్లు కొన్న పట్టదారులు విలేకరుల సమావేశంలో తమ సమస్యలను వెల్లడించారు. అలాగే 2013లో రఘునందన్ రావు తహశీల్దార్ ఆర్డర్ ఇచ్చిన విషయాన్ని కూడా ప్రస్తావించారు.

## అన్ని ఆధారాలతో బహిరంగ చర్చకు సిద్ధం మీరు సిద్ధమా చంద్రయ్య

మేము అన్ని ఆధారాలతో ఎప్పుడైనా ఎక్కడికైనా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నాం మాపై ఆరోపణలు చేసిన వారు కూడా వారి వద్ద ఉన్న ఆధారాలతో చర్చకు వస్తారా అని చంద్రయ్య సవాల్ విసిరారు.

ఎలాంటి ఆధారాలు లేకుండా పార్టీ అధికారంలో ఉందని తప్పుడు ఆరోపణలు చేస్తే సహించమని కర్రోళ్ల చంద్రయ్య హెచ్చరించారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారిని భయభ్రాంతులకు గురి చేయడానికి రాజకీయంగా నన్ను దెబ్బతీయాలని కుట్ర చేస్తున్నారని చంద్రయ్య ఆరోపించారు. ఎదుటివారి లాగా దిగజారి లేమని నీతి నిజాయితీగా క్రమశిక్షణగా ప్రజలకు సేవ చేసుకుంటూ ఉన్నామని చంద్రయ్య అన్నారు.

## అధికారుల సర్వేతో వాస్తవాలు వెలుగులోకి రావాలి

పేరేడు 1, 2 భూములపై స్థానికంగా రాజకీయ కారణాలతో తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని చంద్రయ్య విమర్శించారు. భూమికి సంబంధించిన పాత పత్రాలు, రెవెన్యూ రికార్డులు, కోర్టు ఉత్తర్వులు, ఒప్పంద పత్రాలను పరిశీలించి అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. భూమి స్వరూపం, హక్కులపై నెలకొన్న వివాదానికి అధికారిక రికార్డుల పరిశీలనతో తెరపడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇసాక్ రెడ్డి, అజాంఅలీ,పాండు రంగయ్య,వెంకటేశ్వర్లు,శ్రీహరి, శంకర్,యాదయ్య,కానాపురం సాగర్,ఒగ్గు మల్లేష్, చాకలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పొలంలోకి వెళ్లే దారికి కంచె.. ఇబ్బందులు పడుతున్నాం






**ప్రజావాణిలో కలెక్టర్కు ఫిర్యాదు చేసిన బాధితుడు**

పొలంలోకి వెళ్లే దారిలో కంచె వేయడంతో పాటు రాళ్లతో గోడ నిర్మించి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మల్యాల మండలం మానాల గ్రామానికి చెందిన బల్మూరి విద్యాసాగర్ రావు సోమవారం జగిత్యాల కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ.. తమ సోదరుల మధ్య గతంలోనే భూ పంపకాలు జరిగాయని, తనకు చెందిన మూడు ఎకరాల పొలంలోకి వెళ్లేందుకు 15 అడుగుల వెడల్పుతో దారి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే బల్మూరి వెంకట్, రాహుల్లు పొలంలోకి వెళ్లకుండా దారికి అడ్డంగా కంచె వేయడమే కాకుండా, రాళ్లతో గోడను నిర్మించారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయంపై గ్రామపంచాయతీతో పాటు పోలీస్స్టేషన్లో పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా ఇతరుల ద్వారా బెదిరింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ సైతం తమను ఏమీ చేయలేరని వారు అంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి, తమ పొలంలోకి వెళ్లేందుకు ఉన్న దారిని పునరుద్ధరించి, న్యాయం చేయాలని బల్మూరి విద్యాసాగర్ రావు కోరారు.

# దేవరకొండ 15వ వార్డులో డ్రైనేజీ లీకేజీతో ప్రజల అవస్థలు

## అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**మూడు నెలలుగా మురుగు కష్టాలు మున్సిపల్ అధికారులకు కనిపించని సమస్య**

దేవరకొండ: పట్టణంలోని 15వ వార్డులో డ్రైనేజీ సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉర్దూ మీడియం పాఠశాల ముందు ఉన్న అండర్గ్రౌండ్ డ్రైనేజీ లీకేజీ కావడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి నిలిచిపోతోంది. దీంతో పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు



గత మూడు నెలలుగా ఈ సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి, కౌన్సిలర్కు తీసుకెళ్లినా పరిష్కారం లభించడం లేదని స్థానికులు వాపోతున్నారు. కౌన్సిలర్ ఇంటి సమీపంలోనే ఈ పరిస్థితి నెలకొన్నప్పటికీ సమస్యను పరిష్కరించకపోవడం బాధాకరమని వారు పేర్కొంటున్నారుఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ లీకేజీని అరికట్టి మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు



## స్వదేశీ గ్రీన్ ప్రొపల్షన్ టెక్నాలజీకి రూ.116 కోట్ల ఆర్థిక మద్దతు మనస్తు స్పేస్‌తో టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు ఒప్పందం రూ.277.63 కోట్లతో ఉపగ్రహాలు, ప్రయోగ వాహనాల కోసం అధునాతన చోదక వ్యవస్థల అభివృద్ధి

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:**
స్వదేశీ అంతరిక్ష సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేస్తూ, పర్యావరణ అనుకూల చోదక వ్యవస్థల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మద్దతు అందిస్తోంది. మహారాష్ట్రలోని నవీ ముంబైకి చెందిన మనస్తు స్పేస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కేంద్ర శాస్త్ర--సాంకేతిక శాఖ పరిధిలోని టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు (టీడీబీ) ఒప్పందం కుదుర్చుకుంది. పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల (ఆర్‌డీఐ) నిధి కింద సంస్థకు రూ.116 కోట్ల ఆర్థిక సహాయం అందించనుంది.

మొత్తం రూ.277.63 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో ఉపగ్రహాలు, ప్రయోగ వాహనాల కోసం అధిక పనితీరు, తక్కువ వ్యయంతో కూడిన సమగ్ర గ్రీన్ ప్రొపల్షన్ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు. ఐదు మిల్లీన్యూటన్ల నుంచి 300 న్యూటన్ల వరకు థ్రస్ట్ అవసరాలకు అనుగుణంగా దీనిని రూపొందించనున్నారు. ప్రస్తుతం సాంకేతిక సంసిద్ధత స్థాయి టీఆర్ఎల్--6లో ఉన్న పరిజ్ఞానాన్ని, పూర్తిస్థాయి వినియోగానికి సిద్ధమైన టీఆర్ఎల్--9కు తీసుకెళ్లడం లక్ష్యం. ఈ ఆర్థిక మద్దతును నిర్దిష్ట నిబంధనల మేరకు వాటాలుగా మార్చుకునే అవకాశం ఉన్న రుణం రూపంలో అందించనున్నారు.



మనస్తు స్పేస్ అభివృద్ధి చేస్తున్న వ్యవస్థలో ప్రత్యేక సంకలితాలతో కూడిన హైడ్రోజన్ పెరాక్సైడ్ ఆధారిత పర్యావరణ అనుకూల ప్రొపెల్లెంట్‌ను వినియోగిస్తున్నారు. దీనికి అనుసంధానంగా ఇంజిన్, ఉత్ప్రేరక వ్యవస్థ పనిచేస్తాయి. సంప్రదాయ ప్రొపెల్లెంట్ల వినియోగంలో ఎదురయ్యే నిర్వహణ సవాళ్లను తగ్గించడంతో పాటు పనితీరు, వ్యయ సామర్థ్యాన్ని మెరుగుపరచడం ఈ సాంకేతికత ప్రత్యేకత.

చిన్న ఉపగ్రహాల నుంచి అధిక చోదక శక్తి అవసరమయ్యే వ్యవస్థల వరకు ఉపయోగించుకునేలా దీనిని విస్తరించవచ్చు. ప్రాజెక్టులో భాగంగా చోదక ఇంజిన్లు, ప్రొపెల్లెంట్ సరఫరా వ్యవస్థలతో పాటు అత్యంత అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే సిరామిక్ ఉత్ప్రేరకాన్ని అభివృద్ధి చేయనున్నారు.

ఈ చోదక సాంకేతికతను ఇప్పటికే అంతరిక్షంలో ప్రదర్శించారు. తదుపరి ఇంజినీరింగ్ అభివృద్ధి, వ్యవస్థల అనుసంధానం, పరీక్షలు, ధ్రువీకరణ ద్వారా దీని విశ్వసనీయతను పెంచి విస్తృత వినియోగానికి సిద్ధం చేయనున్నారు. అంతరిక్ష ప్రయోగాల భద్రత, వ్యయ సామర్థ్యాన్ని మెరుగుపరచడంతో పాటు విదేశీ సాంకేతికతపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం లక్ష్యం.

స్వదేశీ చోదక సాంకేతికతలు భారత అంతరిక్ష రంగ సామర్థ్యాల బలోపేతానికి కీలకమని టీడీబీ కార్యదర్శి రాజేష్‌కుమార్ పాఠక్ పేర్కొన్నారు. అధునాతన అభివృద్ధి దశ నుంచి వినియోగ దశకు చేరేందుకు నిరంతర పెట్టుబడులు అవసరమయ్యే సాంకేతిక కార్యక్రమాలకు ఆర్‌డీఐ నిధి ద్వారా మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.

టీడీబీ సహకారంతో తమ గ్రీన్ ప్రొపల్షన్ సాంకేతికత అభివృద్ధి, అనుసంధానం, ధ్రువీకరణను వేగవంతం చేస్తామని మనస్తు స్పేస్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ పేర్కొన్నారు. మెరుగైన పనితీరు, విశ్వసనీయత, తక్కువ వ్యయంతో కూడిన సురక్షిత చోదక వ్యవస్థను రూపొందించి, భారత స్వదేశీ అంతరిక్ష సామర్థ్యాలను పెంచేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందని తెలిపారు.

## జీవ సాంకేతిక రంగంలో ప్రపంచ నాయకత్వం దిశగా భారత్ పరిశోధన ఫలితాలను ప్రజలకు ఉపయోగపడే పరిష్కారాలుగా మార్చాలి ఐసీజీఈబీలో ఎస్టిక్--2026 సన్నాహక కార్యక్రమం

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:**
శాస్త్రీయ పరిశోధనలను ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచడం ద్వారా జీవ సాంకేతిక రంగంలో భారత్ ప్రపంచ నాయకత్వ స్థానానికి ఎదగగలదని నీతి ఆయోగ్ సభ్యుడు ప్రొఫెసర్ గోవర్ధన్ దాస్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ జెనెటిక్ ఇంజినీరింగ్ అండ్ బయోటెక్నాలజీ (ఐసీజీఈబీ)లో నిర్వహించిన ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ (ఎస్టిక్--2026) సన్నాహక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

భారత్‌లో పెరుగుతున్న శాస్త్రీయ సామర్థ్యాలు దేశాభివృద్ధికి, ఆవిష్కరణల వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతున్నాయని గోవర్ధన్ దాస్ తెలిపారు. మౌలిక జీవశాస్త్ర పరిశోధనలు ప్రాణాలను కాపాడే ఆవిష్కరణలకు మార్గం చూపుతాయని, కొవిడ్--19 వ్యాక్సిన్ల అభివృద్ధి ఇందుకు ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొత్తగా ఎదురవుతున్న అంతర్జాతీయ సవాళ్లను పరిష్కరించడంలో బయోటెక్నాలజీ కీలక పాత్ర పోషించగలదని విశ్వాసం వ్యక్తం చేశారు.

కేంద్ర బయోటెక్నాలజీ శాఖ కార్యదర్శి డాక్టర్ రాజేష్ ఎస్. గోఖలే మాట్లాడుతూ.. శాస్త్రీయ ఆవిష్కరణలను విస్తృత స్థాయిలో ఉత్పత్తి చేసి సమాజానికి అందుబాటులోకి తీసుకొచ్చినప్పుడే వాటి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. పెన్సిలిన్ ఆవిష్కరణ, భారీ స్థాయి ఉత్పత్తిని ఇందుకు ఉదాహరణగా వివరించారు. బయోటెక్నాలజీ రెండో విప్లవ దశలోకి అడుగుపెడుతోందని, ప్రయోగశాలల్లోని పరిశోధనలను ఆచరణలోకి తీసుకురావడానికి పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తి విస్తరణను బలోపేతం చేయాలని సూచించారు.

కార్యక్రమంలో సిస్టమ్స్ అండ్ సింథటిక్ బయాలజీపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంక్లిష్ట జీవ వ్యవస్థలను అర్థం చేసుకోవడం, అవసరాలకు అనుగుణంగా జీవ ప్రక్రియలను రూపొందించడం ద్వారా వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక బయోటెక్నాలజీ, సుస్థిర అభివృద్ధి రంగాల్లో సాధించగల పురోగతిపై చర్చించారు.

బయోటెక్నాలజీ శాఖ సైంటిస్ట్--హెచ్, బైరాక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ధనంజయ్‌కుమార్ తివారీ మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ, జీవ ఆధారిత తయారీ, బయోడిజైన్ రంగాల్లో ఈ సాంకేతికతలకు విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. జీవశాస్త్ర పరిశోధనలను వేగవంతం చేయడంలో కృత్రిమ మేధ ప్రాధాన్యాన్ని వివరించారు. బయోఈ3 విధానం భారత బయోటెక్నాలజీ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించగలదని పేర్కొన్నారు.

ఐసీజీఈబీ న్యూఢిల్లీ డైరెక్టర్ డాక్టర్ రమేష్ వి. సోంటి ఎస్టిక్--2026 లక్ష్యాలను వివరించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న ఈ సదస్సులో బయోటెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో 'సిస్టమ్స్ అండ్ సింథటిక్ బయాలజీ'పై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జీవనంలోని దాదాపు ప్రతి అంశాన్ని ప్రభావితం చేసే ఈ రంగాలు శాస్త్రీయ పురోగతికి విస్తృత అవకాశాలను అందిస్తున్నాయని అన్నారు.

# దేశీయ కళాకారులకు అండగా జెమ్ 'ఆభార్ కలెక్షన్'

**10 చేనేత, హస్తకళల ఎంపోరియంల నుంచి 294 ఉత్పత్తుల జాబితాలు**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:**
భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే బహుమతులు, గిఫ్ట్ హ్యాంపర్లను ప్రభుత్వ కొనుగోలుదారులకు చేరువ చేసేందుకు గవర్నమెంట్ ఈ--మార్కెట్‌ప్లేస్ (జెమ్) 'ది ఆభార్ కలెక్షన్'ను ప్రోత్సహిస్తోంది. ప్రత్యేక డిజిటల్ విక్రయ వేదికగా రూపొందించిన ఈ కలెక్షన్ ద్వారా హస్తకళాకారులు, చేనేత కార్మికులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, మహిళల ఆధ్వర్యంలోని సంస్థలకు మార్కెట్ అవకాశాలు కల్పిస్తోంది.

'ఒక జిల్లా--ఒక ఉత్పత్తి' (ఓడీఓపీ) కార్యక్రమంతో అనుబంధమున్న ఉత్పత్తులు, భౌగోళిక గుర్తింపు (జీఐ) పొందిన వస్తువులకు ఇందులో చోటు కల్పించారు. ప్రస్తుతం 10 కేంద్ర, రాష్ట్ర చేనేత--హస్తకళల ఎంపోరియంలకు చెందిన 294 ఉత్పత్తుల కేటలాగ్ జాబితాలు అందుబాటులో ఉన్నాయి.

సెంట్రల్ కాటేజ్ ఇండస్ట్రీస్ ఎంపోరియంకు చెందిన 'కాటేజ్', ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్‌కు చెందిన 'ఖాదీ ఇండియా'తోపాటు గుజరాత్‌కు చెందిన గర్వీ గుర్జరీ, హిమాచల్‌ప్రదేశ్ హిమ్‌క్రాఫ్ట్, జార్ఖండ్ ఝార్‌క్రాఫ్ట్, కర్ణాటక కావేరి, మధ్యప్రదేశ్ మృగనయని, మహారాష్ట్ర మరాఠీ, ఈశాన్య ప్రాంత పూర్బశ్రీ, తమిళనాడు పూంపుహార్ ఉత్పత్తులు ఈ కలెక్షన్‌లో ఉన్నాయి.

మరో ఏడు ప్రభుత్వ ఎంపోరియంలు, సంస్థలను విక్రేతలుగా నమోదు చేసే ప్రక్రియ తుది దశలో ఉంది. కాఫీ బోర్డు, పశ్చిమబెంగాల్‌కు చెందిన మంజూషా, బిశ్వ బంగ్లా, జమ్మూకశ్మీర్ హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ మార్కెటింగ్ కార్పొరేషన్, నాగాలాండ్ మెరక్షె, ఒడిశా ఉత్కళిక, మణిపూర్ పాంథోయిబి ఇందులో చేరనున్నాయి. వీటి చేరికతో మరిన్ని ప్రాంతీయ ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి.

హస్తకళలు, చేనేత వస్త్రాలు, సంప్రదాయ ఆహార పదార్థాలు, వంటింటి అవసరాల ఉత్పత్తులు, వ్యక్తిగత సంరక్షణ వస్తువులు ఈ కలెక్షన్‌లో లభిస్తాయి. అధికారిక వేడుకలు, సదస్సులు, విదేశీ ప్రతినిధి బృందాల పర్యటనలు, ఉద్యోగుల సన్మానాలు, పదవీ విరమణ కార్యక్రమాలు, పండుగల సందర్భంగా అందించే బహుమతుల కోసం ప్రభుత్వ సంస్థలు వీటిని కొనుగోలు చేయవచ్చు.

దేశీయ కళలకు గుర్తింపు పెంచడంతోపాటు తగిన మార్కెట్ అవకాశాలు అందని విక్రేత వర్గాలకు సాధికారత కల్పించడంలో ఆభార్ కలెక్షన్ కీలక ముందడుగని జెమ్ సీఈఓ మిహిర్ కుమార్ పేర్కొన్నారు. దేశంలోని కళాకారుల ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోళ్ల వ్యవస్థతో అనుసంధానించాలనే ఉద్దేశంతో 2024 జూలైలో ఈ వేదికను ప్రారంభించినట్లు జెమ్ అదనపు సీఈఓ అజిత్ బి. చవాన్ తెలిపారు. మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వరంగ సంస్థలు తమ బహుమతుల అవసరాలను తీర్చుకుంటూనే స్థానిక ఉత్పత్తులు, జీవనోపాధులకు మద్దతు ఇవ్వవచ్చని వివరించారు.

## పాఠశాల విద్య నుంచి ఉపాధి వరకు పటిష్ఠ అనుసంధానం ఢిల్లీలో సీబీఎస్ఈ నాలుగో జాతీయ సదస్సు విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాల సమన్వయంపై కార్యదర్శి టి.కె. అనిల్‌కుమార్ దృష్టి

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:**
పాఠశాల విద్యను ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలతో అనుసంధానించాలని కేంద్ర పాఠశాల విద్య--అక్షరాస్యత శాఖ కార్యదర్శి టి.కె. అనిల్‌కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తుపై అవగాహనతో నిర్ణయాలు తీసుకునేలా విద్యావ్యవస్థ తోడ్పడాలని సూచించారు. 'పాఠశాల నుంచి ఉద్యోగ ప్రపంచంలోకి సులభ పరివర్తన' అంశంపై సోమవారం న్యూఢిల్లీలో ప్రారంభమైన సీబీఎస్ఈ నాలుగో జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఢిల్లీ--ఎన్‌సీఆర్ సహోదయ స్కూల్ కాంప్లెక్స్‌ల సహకారంతో కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) అక్టోబర్ 26, 27 తేదీల్లో ఈ సదస్సును నిర్వహిస్తోంది. కార్యక్రమంలో సీబీఎస్ఈ చైర్మన్ డాక్టర్ మన్‌దీప్ భండారీతో పాటు కేంద్ర విద్యాశాఖ, సీబీఎస్ఈ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సదస్సుకు సంబంధించి నాలుగు ప్రధాన ప్రాధాన్యాలను అనిల్‌కుమార్ వివరించారు. సాంకేతికత, డిజిటల్ భద్రత--నైపుణ్యాలు; డిజైన్, సృజనాత్మకత--ఆవిష్కరణలు; జాతీయ క్రెడిట్




ఫ్రేమ్‌వర్క్ ద్వారా వివిధ విద్యావ్యవస్థల్లో నైపుణ్యాలకు గుర్తింపు; సమాన అవకాశాలతో కూడిన కెరీర్ మార్గదర్శకత్వం కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు నిరంతరం ఎదుగుతూ, సమాజానికి దోహదపడుతూ, గౌరవప్రదంగా జీవించేందుకు విద్య పునాది కావాలని ఆకాంక్షించారు. ప్రధాన విద్యాబోధనలో నైపుణ్య విద్యను మరింతగా భాగం చేయడం, విద్యార్థులు పాఠశాలల నుంచి ఉద్యోగ ప్రపంచంలోకి సులభంగా అడుగుపెట్టేలా సిద్ధం చేయడం ఈ రెండు రోజుల సదస్సు లక్ష్యం. పాఠశాలల అధిపతులు, ఉపాధ్యాయులు, పరిశ్రమల నిపుణులు, విధాన రూపకర్తలు భవిష్యత్ ఉద్యోగాలకు అవసరమైన సామర్థ్యాలు, విద్యార్థులను తీర్చిదిద్దే వినూత్న విధానాలపై చర్చిస్తున్నారు. జాతీయ విద్యా విధానం--2020 ఆశయాలకు అనుగుణంగా వివిధ విద్యా విభాగాల మధ్య అడ్డంకులను తొలగించి, మారుతున్న ఉపాధి రంగానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడంపై సదస్సు దృష్టి సారిస్తోంది. వినూత్న బోధనా పద్ధతులు, నూతన మూల్యాంకన విధానాలు, విద్యలో డిజిటల్ సాంకేతిక వినియోగంపై ముఖాముఖి సమావేశాలు, నిపుణుల చర్చలు నిర్వహిస్తున్నారు. సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల ఉపాధ్యాయులు నైపుణ్య విద్యలో విజయవంతమైన అనుభవాలు, ఉత్తమ విధానాలను అధ్యయన పత్రాలు, పోస్టర్ల రూపంలో ప్రదర్శిస్తున్నారు. బోధన--అభ్యసన ప్రక్రియలను మెరుగుపరిచే ఆచరణాత్మక వ్యూహాలను పంచుకోవడంతో పాటు పరస్పర మార్గదర్శకత్వం, భాగస్వామ్యాలకు సదస్సు వేదికగా నిలుస్తోంది.

# ఢిల్లీకి బయలుదేరిన తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తాం**

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26: తెలంగాణ రాష్ట్ర ప్రగతి, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను అంతర్జాతీయ వేదికపై వివరించి, తెలంగాణ ఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేస్తానని తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు.

ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు సోమవారం ఉదయం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో మాట్లాడుతూ, బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ రాష్ట్ర గొంతును బలంగా వినిపిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశాల ద్వారా తెలంగాణ అభివృద్ధి, రాష్ట్ర ప్రగతికి సంబంధించిన కీలక అంశాలను వివరించనున్నట్లు తెలిపారు. స్పీకర్ పర్యటన విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షించారు.

# ఏపీ కి కేంద్రం భారీ సాయం

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం భారీ సాయం అందించింది. ఏపీలో రూ.27,370 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న భారీ విద్యుత్ ప్రసార ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడమే లక్ష్యంగా గ్రీన్ ఎనర్జీ కారిడార్-3కు ఆమోదించింది. ఏపీలో గ్రీన్ ఎనర్జీ రంగానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కార్ ఊతమిచ్చింది. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని విస్తరించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్ (+జుజ-×××) కింద ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. లైన్లు, రామాయపట్నం, కొప్పాకలలో కొత్తగా 400 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీలో విద్యుత్ ప్రసార వ్యవస్థ ఆధునికీకరణకు మోదీ సర్కార్ ఆమోదం తెలిపింది. రూ. 27,370 కోట్ల విలువైన ప్రాజెక్టుకు ఆమోదించింది. 9,500 ఎంవీఏ సామర్థ్యంతో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం జరగనుంది. 2029-30 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రణాళికలను కేంద్రం రచించింది. ఏపీలోని పోర్టు ప్రాంతాలు, పారిశ్రామిక క్లస్టర్లకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రామాయపట్నంలో 400 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# డ్రగ్స్ పై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:**
హైదరాబాద్‌లో గంజాయి విక్రయాలపై ఈగల్ ఫోర్స్ అధికారులు ఈరోజు (సోమవారం) ఆకస్మిక దాడులు జరిపారు. ఈ తనిఖీల్లో ఎల్‌బీఎస్ నగర్‌లో ఇంటి నుంచే గంజాయి విక్రయిస్తున్న 75 ఏళ్ల షేక్ జాతెన్ బీని అరెస్ట్ చేశారు. నిందితురాలి ఇంట్లో 41 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమె దగ్గరి నుంచి మొత్తం 179.1 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. ఈ ఆపరేషన్‌లో 70 మంది గంజాయి వినియోగదారులను గుర్తించారు. 66 మందికి వైద్య పరీక్షలు జరపగా.. ఈ పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్లుగా పాజిటివ్‌గా నిర్ధారించారు. గంజాయి వినియోగదారుల్లో ముగ్గురు బాలురని, మరో 65 మందిని పునరావాస కేంద్రాలకు ఈగల్ అధికారులు తరలించారు. అలాగే, గాంధీ రిహాబిలిటేషన్ సెంటర్‌కు 45 మందిని, ఆమనగల్ కేంద్రానికి 15 మంది, కొత్తూరు కేంద్రానికి ఐదుగురిని తరలించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి సరఫరా మూలాలు, ఇతర వ్యక్తుల పాత్రపై ఈగల్ అధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితురాలు షేక్ జాతెన్ బీపై గతంలో మరో ఏడు కేసులు ఉన్నట్లు గుర్తించారు.

### గచ్చిబౌలిలో డ్రగ్స్ పట్టివేత

అలాగే, గచ్చిబౌలిలో తెలంగాణ టాస్క్‌ఫోర్స్ టీమ్ తనిఖీలు చేసి డ్రగ్స్‌ను పట్టుకున్నారు. ఖాజాగూడా సర్వీస్ రోడ్డులో డ్రగ్స్ విక్రయిస్తుండగా ఫొటోగ్రాఫర్ ఏ. సాయిరామ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు సాయిరామ్ నుంచి 4.45 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గ్రాము రూ.10 వేల చొప్పున అతడు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి నుంచి కారు, డిజిటల్ వేయింగ్ మిషన్, 2 సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు మహేశ్‌రెడ్డి, తాంద్ర హరిశ్చంద్ర కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందినవారిగా గుర్తించారు.

# వృథాపై జలమండలి కొరడా..?

**ప్యారడైజ్ హోటల్‌కు రూ.20 వేల జరిమానా..!!**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:**
తాగునీటిని దుర్వినియోగం చేసినందుకు సికింద్రాబాద్ హోటల్ ప్యారడైజ్ యాజమాన్యానికి జలమండలి రూ.20 వేల జరిమానా విధించింది.

ఖైరతాబాద్ జోన్ పరిధిలోని డివిజన్-16 అధికారులు నిర్వహించిన తనిఖీల్లో హోటల్ ప్యారడైజ్‌లో (జూచీ నంబర్: 612182839) నీటి దుర్వినియోగాన్ని గుర్తించారు. దీంతో రూ.20 వేల జరిమానా విధించడంతో పాటు భవిష్యత్తులో నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని యాజమాన్యానికి సూచించారు. నీటి దుర్వినియోగానికి పాల్పడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని జలమండలి అధికారులు హెచ్చరించారు.

# హైదరాబాద్ నగరవాసులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:**
తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరవాసులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు ఎదురుచూస్తున్న అందించింది. సుదీర్ఘ కాలంగా హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ ప్రతిపాదనలకు కేంద్రం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76 కిలోమీటర్ల మేర ఐదు కొత్త కారిడార్లలో ఈ నిర్మాణ పనులను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మెట్రో ఫేజ్-2 పనులను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించే నాగోల్- ఎయిర్పోర్ట్(ఎయిర్పోర్ట్ కారిడార్) మార్గంతో ముందుగా ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టును 2029 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

త్రినెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సాంస్కృతికం

12
మంగళవారం అక్టోబర్ 27, 2026
www.trinetnews.com

# నాట్య గురువు ను సన్మానిస్తున్న కోలేటి దామోదర్ గుప్తా






**శాస్త్రీయ గుర్తింపు తెచ్చిన మహానుభావులలో పద్మ భూషణ్ వెంపటి చినసత్యం ప్రథముడు**
**-కోలేటి దామోదర్ గుప్తా**

**హైదరాబాద్,రవీంద్ర భారతి, ట్రైనెట్ న్యూస్,** అక్టోబర్ 25: కూచిపూడి నృత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేసి, దానికి శాస్త్రీయ గుర్తింపు తెచ్చిన మహానుభావులలో పద్మ భూషణ్ వెంపటి చినసత్యం ప్రథములని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో
ప్రసిద్ధ కూచిపూడి నాట్యాచార్యులు పద్మభూషణ్ వెంపటి చిన సత్యం 87వ జయంతి పురస్కరించుకుని రవీంద్రభారతిలో సిరిసిరిమువ్వలు – 7 పేరిట సంప్రదాయ కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోలేటి దామోదర్ గుప్తా, గౌరవ అతిథులుగా నాట్య గురువు లు చలపతి శాస్త్రి, డా. ప్రసన్న రాణి, ప్రసాద్, ప్రశాంతి పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి వెంపటి చిన్న సత్యం కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోలేటి దామోదర్ గుప్తా మాట్లాడుతూ, నాట్యశాస్త్ర నిబంధనలను కూచిపూడికి జోడించి, నృత్య రూపకాలను పునరుద్ధరించిన మహానీయులు వెంపటి చినసత్యం అని ఆయన గుర్తుచేశారు. కూచిపూడి నాట్యంలో సరికొత్త ప్రయోగాలు చేయడానికి తన జీవితమంతా అంకితం చేసిన విదుషీధీమణి వెంపటి చిన సత్యం అని కోలేటి కొనియాడారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.

# ట్రైనెట్ న్యూస్ శశిమోహన కాంతి కిరణం...




**"మాట హద్దు దాటితే తప్పు ..ఖర్చు హద్దు దాటితే అప్పు ఈ రెండు హద్దులు దాటితే ...మనశ్శాంతికే పెనుముప్పు." ముందుగా మాట హద్దు దాటితే తప్పు అన్న విషయాన్ని చర్చించుకుందాం....**

మాట అనేది భగవంతుడు మానవాళికి ఇచ్చిన అత్యంత అద్భుతమైన మరియు గొప్ప వరం. సృష్టిలోని ఏ ఇతర జీవికీ లేని ఈ వాక్చాతుర్యం కేవలం మనిషికి మాత్రమే సొంతం. మాట ద్వారానే మనం మన ఆలోచనలను, భావాలను మరియు ప్రేమానురాగాలను ఇతరులతో పంచుకోగలుగుతున్నాం. బంధాలను కలపడనికి,పెంచటానికి మాట ఎంత కీలకమైన పాత్ర పోషిస్తుందో అదే విధంగా బంధాలను త్రెంచి వేయడంలో కూడా మాట అన్నది ప్రముఖ పాత్ర వహిస్తుంది.

మంచి మాటలు ఎదుటి మనిషిలో ధైర్యాన్ని సంతోషాన్ని నింపుతాయి. కానీ అనాలోచితంగా మాట్లాడిన మాటలు ఎదుట మనిషి హృదయాన్ని గాయపరుస్తాయి. .మనుషుల మధ్య ఉన్న బంధాలను కూడా దూరం చేస్తాయి. అందుకే మాట పదిలం అంటారు.

మాట ఇవ్వటం తేలిక కానీ ఆ మాటను నిలుపుకోవటం చాలా కష్టం. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం అంతకన్నా కష్టం. మాట నిలబెట్టుకోలేని చోట నమ్మకం విలువను పోగొట్టుకుంటుంది. సరైన సమాధానం చెప్పలేనప్పుడు మౌనంగా ఉండటమే మంచిది.

అందుకే మనం ఏ మాట మాట్లాడినా కొంచెం ఆలోచించుకొని మాట్లాడటం ఉత్తమం.

ఒక చిన్న తియ్యటి మాట రెండు మనసులను కలపడంలో ,విడిపోయిన బంధాలను తిరిగి కలపడంలో అద్భుతమైన శక్తిని కలిగి ఉంటుంది. మనసుకు తగిలిన గాయాలను మాన్పుతుంది. గాయపడ్డ హృదయానికి మంచి మాటలు స్వాంతన కూర్చటమే కాక, కొత్త ఆశలను కూడా చిగురింప చేస్తాయి. ఒక నిజమైన నాయకుడి మాటలు వేలాది మందిలో స్ఫూర్తిని నింపుతాయి. ఆ మాటలు సమాజంలో విప్లవాత్మక మార్పులను తీసుకు రాగలవు. అదే మాట హద్దు మీరితే సమాజంలో మనకున్న గౌరవాన్ని ,ఒక్కోసారి కెరీర్ ని క్షణాల్లో బూడిద చేయగలదు. అందుకే పెద్దలు అంటారు "నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అని". ఇది సామెత కాదు. సకల జనులు ఆచరించదగ్గ కఠిన సత్యం. ఇంకొక సామెత కూడా ఉంది "కాలు జారినా తీసుకోవచ్చు మాట జారితే తీసుకోలేము" అని. ఈ సామెతలు కేవలం సొల్లు మాటలు కాదు.ఒకనాడు మన పెద్దలు అనుభవ సారాన్ని ఈ సామెతల రూపంలో సూక్తులుగా మనకి చెప్పారు.మాట జారటం జరిగితే గొడవలు రావడమే కాకుండా ఒక్కోసారి అవి హత్యలకు కూడా దారిచేస్తాయి ఎన్నో కాపురాలుఛిన్నాభిన్నం అవుతాయి. మాట జారిన తరువాత ఎంత విచారించినా ప్రయోజనం ఉండదు.

అందుకే ఎక్కడ ఎంత మాట్లాడాలో తెలుసుకోవాలి. మాట్లాడేటప్పుడు ఎదుట వారి మనోభావాలను గౌరవించాలి. నిజా నిజాలను తెలుసుకోకుండా ఎవరి వ్యక్తిత్వాన్ని గాయపరచకూడదు. సమయం, సందర్భం తెలియకుండా అనవసరమైన విషయాల్లో తలదూర్చి మాట్లాడకూడదు. ఈ విచక్షణ ఉన్నప్పుడు మాట ఎప్పటికీ హద్దు దాటదు తప్పుగా మారదు..

ఇది చాలా విస్తృతమైన అంశం కనుక మిగతాది రేపు చర్చించుకుందాం.

శుభోదయం..... శశిబాల

# మహిళల ప్రయాణాల్లో తెలంగాణ టాప్



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో రాష్ట్రం లో మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరిగాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ పథకం మహిళల ఆత్మగౌ రవం, స్వేచ్ఛ, స్వయం ప్రతిపత్తికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. మహిళల సాధికారతకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఈ గణాం కాలు నిదర్శనమని ఎక్స్ వేదికగా వెల్లడించారు. జాతీయ గణాంక కార్యాలయం నిర్వహించిన ఆల్ ఇండియా టైమ్ యూజ్ సర్వే ప్రకారం.. తెలంగాణలో 15 నుంచి 59 ఏళ్ల వయసున్న మహిళల్లో రోజూ కనీసం ఒక్క సారైనా బయటకు ప్రయాణించే వారి శాతం 2019లో 43.7గా ఉండగా, 2024 నాటికి 54.6 శాతానికి పెరిగింది. ఐదేళ్లలో 10.9 శాతం పాయింట్ల వృద్ధి నమోదైంది. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలవుతున్న తమిళనాడులో 6.7, కర్ణాటకలో 5, పంజాబ్లో 4.1 శాతం పాయింట్ల వృద్ధి నమోదైంది. ప్రస్తుతం రోజుకు సుమారు 37 లక్షల మంది మహిళలు టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తూ విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు.

# శ్రీవారిని దర్శించుకున్న భారత ఉప రాష్ట్రపతి





**తిరుమల, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:** భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

ముందుగా క్షేత్ర సాంప్రదాయాన్ని పాటిస్తూ ఉప రాష్ట్రపతి శ్రీ వరాహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయం వద్దకు ఉప రాష్ట్రపతి చేరుకోగానే టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణలు ఆయనను సాదరంగా ఆహ్వానించగా, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. తరువాత ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అటు పిమ్మట వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు.

అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. భారత ఉపరాష్ట్రపతికి టీటీడీ ఈవో, అదనపు ఈవో స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. ఉప రాష్ట్రపతి శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి వారిని కూడా అనంతరం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల్లో జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, టిటిడి బోర్డు సభ్యులు రామ్మూర్తి, దివాకర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, పలువురు రాష్ట్రస్థాయి మరియు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అడవి బాపి రాజు యాది లో




**హైదారాబాద్, చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 26:** శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా దీక్షితులు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా బహుముఖీన సాహితీ వేత్త అడవి బాపి రాజు యాది లో పేరిట ఆయన జయంతి కార్యక్రమం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర రావు మాట్లాడుతూ అడవి బాపి రాజు నాడు రాసిన చారిత్రక నవలలు ప్రసిద్ధి పొందాయి అని చెప్పారు ఆయన గీత రచయిత గనే కాక చిత్ర కారుడు గా కూడా గుర్తింపు పొందిన ప్రజ్ఞా నిధి అన్నారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై సాహితీ వేత్త డాక్టర్ జయ రాములు గాయని అక్కిరాజు యోగిత మిమిక్రీ కళా కారుడు భవిరి శివ పాల్గొన్నారు

# 40 కోట్లుచెల్లిస్తారా?

**నియోజకవర్గ అభివృద్ధికి చావడానికైనా సిద్ధం**
**మంత్రుల సెగ్మెంట్లకే బిల్లులు మంజూరు**
**అవసరమైతే 30 వేల మందితో దీక్ష చేస్తా**
**జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**మహబూబ్ నగర్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 26:** నియోజకవర్గంలో చేసిన, చేయా ల్సిన అభివృద్ధి కోసం ఇప్పటికే ప్రభు త్వం నుంచి రూ.40కోట్లు రావాల్సి ఉంది. మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులు చెల్లిస్తున్నారు. మరి ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటి?'.. అని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిం చారు. ఇవాళ ఆయన రాజాపూర్ మండలంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. తమ గురువు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి రోడ్లు మం జూరు చేసి శంకుస్థాపనలు చేశారని, పనులు పూర్తి అయినా నేటి వరకూ బిల్లులు చెల్లించడం లేదన్నారు. ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క పాద యాత్ర చేస్తూ జడ్చర్లకు వచ్చినప్పుడు 40 వేల మందితో సభ నిర్వహించా నని గుర్తు చేశారు. పార్టీని బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేసిన ఈ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించడం లేదని, దీనివల్ల అభివృద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఓ కాంట్రాక్టర్ చనిపోతే అతనికి చెల్లించాల్సిన రూ.5 కోట్లు ప్రభుత్వం ఇచ్చేసిందని, 'నేను చనిపోతే రూ.40 కోట్లు చెల్లిస్తారా?.. నియోజకవర్గ అభివృద్ధికి చావడానికైనా సిద్ధమే' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే 30వేల మంది తో నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు.



నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకతీతంగా పోరాడుదామని అనిరుధ్ రెడ్డి పిలుపునిచ్చారు.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136